
Follow: @ANNTELUGU
12-01-2026
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 18 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

### పొత్తుల్లేవ్.. గిత్తుల్లేవ్



- జనసేనపార్టీతో పొత్తు అవసరం లేదు
- సింగిల్ గానే పోటీచేస్తాం
- బిజెపి చీఫ్ రామచందర్ రావు హాట్ కామెంట్స్

02

### సచివాలయంలో సస్పెన్స్ థ్రిల్లర్



- హరీశ్ రావు

02

### భారతీయ చట్టాలకు లోబడి పనిచేస్తాం

- తప్పు ఒప్పుకున్న ఎక్స్
- 600 అంకౌట్స్ క్లోజ్

02



అత్యంత అరుదైన ఘనత సాధించిన

## పవన్ కళ్యాణ్

పురాతన జపనీస్ కత్తిసాము కళ 'కెంజుట్సు'లో అధికారికంగా ప్రవేశం

జపనీస్ మార్షల్ ఆర్ట్స్‌లో చారిత్రాత్మక ప్రపంచ గుర్తింపు పొందిన పవన్ కళ్యాణ్

వివరాలు 2లో



### యుద్ధప్రాతిపదికన ఎస్ఎఎల్బీసీ సొరంగం పనులు

- ఈ ఏడాదే ప్రాజెక్టు పూర్తిచేస్తాం
- టీబీఎం స్థానంలో ఆధునిక టెక్నాలజీ వినియోగం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

వివరాలు 2లో



### సంక్రాంతి పండుగకు పల్లె దారి పట్టిన పట్నం

- హైదరాబాద్ విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్
- కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

వివరాలు 2లో




### ఎయిర్ పోర్టుల్లో చౌక టీ

- ఉడాన్ యాత్రి కెఫే ఆరంభం
- సామాన్య విమాన ప్రయాణికులకు వరం
- పది రూపాయలకే టీ, రూ. 20కే కాఫీ
- అతి తక్కువ ధరలకే స్నాక్స్ అందుబాటులోకి

02



### చనాకా - కొరాటా ప్రాజెక్టుపై

# సీఎం రేవంత్ ఫోకస్

## ఆదిలాబాద్ రైతుల నాలుగు దశాబ్దాల కల సాకారం చేయనున్న సీఎం

## రూ.500 కోట్ల వ్యయంతో నిర్మాణం జరుగుతున్న ప్రాజెక్టు

తాజాగా ప్రాజెక్టు ట్రయల్ రన్ .. పెండింగ్ పనులు పూర్తిచేయాలని సీఎం ఆదేశం

ఈనెల 16న ప్రాజెక్టు పనులను పరిశీలించి సమీక్షించనున్న సీఎం రేవంత్

పెండింగ్ పనులు వేగంగా పూర్తిచేసి ఈ ఏడాదే ప్రారంభించాలని ప్రయత్నాలు

ప్రాజెక్టు పూర్తయితే 52వేల ఎకరాలకు సాగునీరు .. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు వరం

**హైదరాబాద్, ఆదిలాబాద్ - మహా:**

ఆదిలాబాద్ జిల్లా రైతుల నాలుగు దశాబ్దాల కలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాకారం చేయనున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో నిర్మించిన చనాక కొరాట ప్రాజెక్టు పనులు దశాబ్దకాలంగా సాగుతుండగా, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించాక పనులపై ఫోకస్ పెట్టారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో కొరాట వద్ద మహారాష్ట్ర సరిహద్దులో పెన్‌గంగా నదిపై ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. 52వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2016లో ఈ ప్రాజెక్టు పనులను ప్రారంభించినా గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు పూర్తిచేయలేకపోయారు. దాదాపు రూ.500కోట్ల వ్యయ అంచనాతో ఈ ప్రాజెక్టును ప్రారంభించగా, ఆదిలాబాద్ ప్రాజెక్టులపై చూపిన నిర్లక్ష్యం కారణంగా పనులు నత్తనడకన సాగాయన్న భావన ఇక్కడి ప్రజల్లో ఉంది. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లోని 52వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఈ ప్రాజెక్టు ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన బ్యారేజీ, గేట్ల నిర్మాణం పూర్తయింది. సైడ్‌వాల్స్ నిర్మాణ పనులను కూడా పూర్తిచేశారు. హత్తీఘాట్ వద్ద పంప్‌హౌజ్ నిర్మాణ పనులు కూడా దాదాపు పూర్తయ్యాయి. మూడు 5.5, మూడు 12 మెగావాట్ల మోటర్లను కూడా ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో తాజాగా నీటిపారుదల శాఖ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. మోటర్లు ఆన్‌చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. పంప్‌హౌస్ నుంచి నీటిని ప్రధాన కాలువల్లోకి వదిలారు. ప్రధాన కాల్వల నుండి పిల్లకాలువలు నిర్మించాల్సి ఉంది. ఇంకా పలు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పెన్‌గంగా ప్రాజెక్టుకు రాష్ట్రంలో నిర్మించే కాలువలకు మహారాష్ట్ర సర్కార్ రూ.1,227 కోట్లను కేటాయించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల పరిధిలో గల 89 గ్రామాల పరిధిలోని 52 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నది.

### ప్రాజెక్టు వద్దకు సీఎం రేవంత్

ఈనెల 16న చనాకా - కొరాటా ప్రాజెక్టు పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించే అవకాశమున్నట్లు సమాచారం. ఆదిలాబాద్ ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టిన సీఎం చనాకా కొరాటా పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించడంతో పాటు ప్రాణహితకు ప్రాణం పోయాలని డిసైడ్ అయ్యారు. గత ప్రభుత్వం పక్కనపడేసిన ప్రాణహిత చేవెళ్ళ ప్రాజెక్టును పునరుద్ధరణ చేయాలని కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. దీనిపై నీటిపారుదల శాఖ అధికారులతో పలుమార్లు సమీక్ష జరిపారు. ఇరిగేషన్ శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ప్రాణహితపై పలుమార్లు ప్రకటనలు చేశారు.

## మునిసిపల్ ఎన్నికల నగారా

### 16న నిర్మల్‌లో సీఎం రేవంత్ సభ

17న వరంగల్, 18న ఖమ్మం?

పట్టణాల్లో విజయఢంకా మోగించే వ్యూహం

ఖమ్మం, వరంగల్ కార్పోరేషన్లకు ముందస్తు?




**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మునిసిపల్ ఎన్నికల నగారా మోగించనున్నారు. ఈనెల 16న నిర్మల్ పట్టణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగసభలో పాల్గొనే అవకాశమున్నట్లు సమాచారం. గ్రామపంచాయతీ ఎన్నికల్లో 66 శాతం పంచాయతీలు గెలిచి అదరగొట్టిన కాంగ్రెస్ మునిపిపాలిటీల్లోనూ మ్యాజిక్ రిపీట్ చేయాలనుకుంటోంది. ఇందులో భాగంగా జిల్లాల పర్యటనలకు సీఎం శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని 123 మునిసిపాలిటీల్లో 90 శాతానికి పైగా కాంగ్రెస్ గెలిచేలా ముఖ్యమంత్రి రేవంత్ వ్యూహరచన చేస్తున్నారు. ఇప్పటికే ఏఐసీసీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ లతో సీఎం మాట్లాడారు. ప్రతీ డివిజన్ నుండి ఐదుపేర్లను తీసుకుని సర్వేల ఆధారంగా టికెట్లు కేటాయించనున్నారు. సర్వేలలో ముందుండే గెలుపుగుర్రాలను అభ్యర్థులను ఎమ్మెల్యేలు, నియోజకవర్గ

మిగతా 2లో

## సత్తుపల్లిలో భారీ సైబర్ దోపిడీ



18 మంది నిందితుల అరెస్ట్

రూ.547 కోట్ల ఘరానా మోసం

అంతర్జాతీయ సైబర్ నేరాల ముఠా గుట్టురట్టు

వివరాలు 2లో

## సీఎం పాలనపై దృష్టి పెట్టాలి

### ఇళ్ళ కట్టట్లేదు.. కూల్చుతున్నారు.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ ప్రభుత్వం గద్దె దిగే నాటికి రాష్ట్రంలో రూ.3.5లక్షల కోట్లు అప్పు ఉందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం చేసిన ఈ అప్పులతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామని ఆయన సోదాహరణగా వివరించారు. ఈ అప్పుల విషయంలో తమపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ కేడర్‌ను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రజల ఆస్తులు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయంటే అందుకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమంటూ రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు కేటీఆర్.

మిగతా 2లో





# సంక్రాంతి పండుగకు పల్లె దారి పట్టిన పట్నం

## హైదరాబాద్- విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్

### కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు



**హైదరాబాద్, మహా :** సంక్రాంతి పండగ వేళ పట్నం మొత్తం పల్లె దారి పట్టింది. హైదరాబాద్ నుండి ఏపీకి వెళ్లే ప్రయాణికులతో సంక్రాంతి పండుగ వేళ హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి జనసంద్రంగా మారింది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం తెల్లవారుజాము నుంచే వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, వాహనాలు వేగంగా ముందుకు సాగేలా అధికారులు అదనపు టోల్ బూత్‌లను అందుబాటులోకి తెచ్చారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు సుమారు 70 వేల వాహనాలు ఏపీ వైపు వెళ్లాయని పంతంగి టోల్ ప్లాజా సిబ్బంది తెలిపారు. ఈ రద్దీ అధివారం ఉదయం నుంచి మరింత పెరిగింది. పెరిగిన రద్దీకి అనుగుణంగా టోల్ వద్ద తగినట్లుగా ఏర్పాట్లు చేశారు. కానీ వాహనాలు ఒకేసారి వేల సంఖ్యలో వస్తుండటంతో టోల్ ప్లాజాల వద్ద వాహనదారులకు చిక్కులు తప్పడం లేదు. హైదరాబాద్ విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్.. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

**వేగంగా ఫాస్టాగ్ స్కానింగ్**

ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఫాస్టాగ్ స్కాన్ వేగంగా జరిగేలా సాంకేతిక ఏర్పాట్లు చేయడంతో పాటు, పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు టోల్‌ప్లాజాల వద్ద అత్యవసర సేవల కోసం అంబులెన్స్, క్రేన్, పెట్రోలింగ్ వాహనాలను సిద్ధంగా ఉంచారు. ఏపీలోని నందిగామ వైజంక్షన్ వద్ద రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో వాహనాలు నెమ్మదిగా సాగుతున్నాయి. దీని వల్ల ఆ ప్రాంతంలో స్వల్పంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రయాణికులు కొంత ఇబ్బంది పడుతున్నారు.

**నల్గొండ, ఖమ్మంలలో రద్దీ..**

సంక్రాంతి సంబరాల వేళ ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాల్లోని ఆర్టీసీ బస్టాండ్‌లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. పండుగకు మరో రెండు రోజులే సమయం ఉండటంతో, ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ సొంతూళ్లకు చేరుకోవడానికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నుండి ఖమ్మం మీదుగా ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాలకు వెళ్లే జనం సంఖ్య విపరీతంగా పెరగడంతో ప్రధాన బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తెలంగాణ ఆర్టీసీ ఖమ్మంతో పాటు ఇతర జిల్లాలకు ప్రత్యేక బస్సులను నడుపుతూ ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూస్తోంది.

శనివారం నుండి సెలవులు కావడంతో విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పండుగకు ముందే సిద్ధమయ్యారు. రెండు రోజులుగా హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ భారీగా కనిపిస్తుంది. హైదరాబాద్‌లో జాబ్ చేసే వారితో పాటు స్థిరపడిన ఏపీ వారంతా తమ స్వగ్రామాలకు పయనమవుతున్నారు. రైళ్లు, బస్సులతో పాటు సొంత వాహనాల్లో సొంతూళ్లకు వెళ్తున్నారు. వ్యక్తిగత వాహనాల్లో సొంతూళ్లకు ఎక్కువ మంది వెళ్తుండటంతో టోల్ ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు క్యూకడుతున్నాయి. గడచిన మూడు రోజులుగా హైదరాబాద్ నుంచి ఏపీతో పాటు తెలంగాణలోని గ్రామాలకు దాదాపు 30 లక్షల మంది పండగ కోసం వెళ్ళారని తెలుస్తోంది.

**బస్టాండ్ల వద్ద భారీ రద్దీ..**

భాగ్యనగరం నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఇతర జిల్లాలకు వెళ్లే ప్రయాణికులతో ప్రధాన కూడళ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రధాన కేంద్రాలైన దిల్‌సుక్ నగర్, ఉప్పల్, ఎల్బీనగర్, హయత్ నగర్, జేబీఎస్ బస్టాండ్లలో ప్రయాణికుల తాకిడి విపరీతంగా పెరిగింది. బస్టాండ్లు ప్రయాణికులతో నిండిపోయినప్పటికీ.. సమయానికి బస్సులు రాకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వగ్రామాలకు వెళ్లేందుకు నగరవాసులు పెద్ద సంఖ్యలో బయలుదేరడంతో బస్టాండ్లన్నీ రద్దీగా మారాయి. టిక్కెట్లు దొరక్క, బస్సుల కోసం గంటల తరబడి వేచి చూస్తూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలతో వచ్చిన వారైతే.. మరిన్ని తీవ్ర అవస్థలు పడుతున్నారు.

**రైళ్లు, బస్సుల్లో 'నో వేకెన్సీ'..**

ప్రయాణికుల డిమాండ్ భారీగా పెరగడంతో బస్సులు, రైళ్లలో అన్ని రిజర్వేషన్లు పూర్తిగా ఫుల్ అయ్యాయి. ఆన్‌లైన్, కౌంటర్ రిజర్వేషన్లు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి రద్దీ దృష్ట్యా ఆర్టీసీ, రైల్వే శాఖలు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నప్పటికీ, ప్రయాణికుల సంఖ్యకు అవి ఏ మాత్రం సరిపోవడం లేదు. సమయానికి బస్సులు రాకపోవడం ప్రయాణికుల సమస్యలను మరింత పెంచుతోంది. షెడ్యూల్ ప్రకారం బస్సులు నడవకపోవడంతో బస్టాండ్లలో గందరగోళం నెలకొంది. కొన్నిచోట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులను ప్రశ్నించారు.

**అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి..**

ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో అదనపు బస్సులు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రద్దీని నియంత్రించేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

**ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ..**

రిజర్వేషన్లు దొరక్కపోవడంతో చాలా మంది ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. దీన్నే అవకాశంగా తీసుకుని.. ప్రైవేట్ బస్సుల్లో అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ వాహనాల్లో సీట్లు దొరకని ప్రయాణికులు చేసేదేమీ లేక ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. దీన్ని అదునుగా చేసుకున్న ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు.. సాధారణ చార్జీల కంటే మూడు రెట్లు అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు ప్రయాణికుల నుంచి రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీని అరికట్టేందుకు ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేపట్టినప్పటికీ అవి నామమాత్రంగానే ఉన్నాయి. టికెట్ పై ఒక ధర వేస్తున్న ట్రావెల్స్ యాజమాన్యాలు, వసూళ్ళు మాత్రం రెట్టింపు చేస్తున్నారు.

**ట్రాఫిక్‌తో నరకం..**

హైదరాబాద్ నుంచి బయటకు వెళ్లే ఎగ్జిట్ పాయింట్ల వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ముఖ్యంగా విజయవాడ వైపు వెళ్లే పంతంగి టోల్ ప్లాజా, వరంగల్ వైపు వెళ్లే రహదారులపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తమ ప్రయాణ సమయాన్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# పొత్తుల్లేవ్.. గిత్తుల్లేవ్

- జనసేనపార్టీతో పొత్తు అవసరం లేదు
- సింగిల్ గానే పోటీచేస్తాం
- బిజెపి చీఫ్ రామచందర్ రావు హాట్ కామెంట్స్

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో బీజేపీ బలంగా ఉందని, రాష్ట్రంలో జనసేనపార్టీతో పొత్తు అవసరం లేదని రాష్ట్ర బీజేపీ చీఫ్ రామచంద్రరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. పొత్తు విషయంలో జాతీయస్థాయిలో నిర్ణయం తీసుకుంటారని, అధిష్ఠానానికి కూడా ఈ విషయమే చెప్తామన్నారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల సమయంలో జనసేన బీజేపీ టీడీపీ పొత్తు వర్కవుట్ అయింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో కూడా బీజేపీ జనసేన కలిసి పోటీ చేస్తే మున్సిపల్ ఎన్నికల్లో కొన్ని ప్రాంతాల్లో గెలిచే అవకాశం ఉందని జనసేన వర్గాలు చెబుతుండగా, ఈ నేపథ్యంలో రామచంద్ర రావు చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. పోటీ, పొత్తులపై తమ నాయకుడు పవన్ కల్యాణ్ దే అంతిమ నిర్ణయమన్నారు.

# సచివాలయంలో సస్పెన్స్ థ్రిల్లర్

### : హరీశ్ రావు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ సచివాలయంలో సినిమాలకు మించి సస్పెన్స్ థ్రిల్లర్ సన్నివేశాలు కొనసాగుతున్నాయని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. సినిమాటోగ్రఫీశాఖా మంత్రికి తెలియకుండానే టికెట్ ధరల పెంపునకు సంబంధించి జీవోలు రావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగశక్తులు రాజ్యమేలుతున్నాయంటూ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా? ఉంటే ఎవరి నియంత్రణలో ఉందనే అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయని ఆరోపించారు.

**ధరల పెంపు సంబంధిత మంత్రికే సంబంధం లేదా?**

ఒకవైపు టికెట్ ధరలు పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు) వెలువడుతుండగా, మరోవైపు సినిమాటోగ్రఫీ శాఖకు బాధ్యత వహిస్తున్న మంత్రి తనకు ఈ నిర్ణయాలతో సంబంధం లేదని, ఫైల్ తన వద్దకు రాలేదని చెప్పడం పాలనా వైఫల్యానికి నిదర్శనమని హరీశ్ రావు విమర్శించారు. శాఖ ఒకరిది, నిర్ణయాధికారం మరొకరిది, జీవోలు ఇచ్చేది ఇంకొకరి వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

**ప్రభుత్వం ఎవరిచేతిలో ఉంది?**

సంబంధిత శాఖ మంత్రికి తెలియకుండానే కీలక నిర్ణయాలు జరిగితే ప్రభుత్వం ఎవరి చేతుల్లో నడుస్తోందనే ప్రశ్న తలెత్తుతుందని హరీశ్ రావు ప్రశ్నించారు. సినిమా టికెట్ ధరల పెంపుపై హైకోర్టు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ప్రభుత్వ తీరు మారలేదని హరీశ్ రావు మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో సినిమా టికెట్ రేట్లు పెంచబోమని, బెనిఫిట్ షోలు ఉండవని స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. అలాంటి ప్రకటనల అనంతరం రాత్రికి రాత్రే జీవోలు ఎలా వచ్చాయంటూ ప్రశ్నించారు. ఇప్పటికే మూడు సినిమాలకు టికెట్ ధరలు పెంచుతూ జీవోలు జారీ అయ్యాయని, మరో సినిమాకు కూడా అదే తరహా అనుమతులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమవుతోందని హరీశ్ ఆరోపించారు.

**నచ్చినవారికి రేట్లు పెంచుతారా?**

తమకు నచ్చిన వారికి రూ.600 వరకు టికెట్ రేట్లకు అనుమతి ఇస్తారా? వారానికి వారం రోజులు రేట్లు పెంచుకునేలా రెడ్ కార్పెట్ వేస్తారా అంటూ హరీశ్ విమర్శలు గుప్పించారు. పాలకుడు పాలసీతో ఉండాలే తప్ప పగతో ఉండకూడదని వ్యాఖ్యానించారు. గత పదేళ్ల పాటు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సినిమా పరిశ్రమను సమానంగా చూసామని, ఎలాంటి వివక్ష చూపలేదని బీఆర్ఎస్ గుర్తుచేసింది. అందుకే తెలుగు సినిమా ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. సినిమా టికెట్ రేట్ల పెంపులో కమీషన్ల దందా జరుగుతోందని, శాఖ మంత్రికి తెలియకుండా ఈ వ్యవహారం సాగుతోందని ఆరోపిస్తూ, దీనిపై గవర్నర్ సమగ్ర విచారణ జరపాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.



# భారతీయ చట్టాలకు లోబడి పనిచేస్తాం

### తప్పు ఒప్పుకున్న ఎక్స్ .. 600 అంకౌట్స్ క్లోజ్

**మహా:** ఎక్స్ ప్లాట్‌ఫామ్ ఏఐ అసిస్టెంట్ గ్రోక్‌ను దుర్వినియోగం చేస్తూ ఆకతాయిలు మహిళల న్యూడ్ ఫోటోలు సృష్టిస్తున్నారు. ఇది ఏఐ బికినీ ట్రెండ్‌గా ఇటీవల వైరల్ అయింది. దీనిపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో దీనిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఎక్స్‌ను భారత ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో ఎక్స్ తన ప్లాట్‌ఫామ్‌లో ఉన్న అసభ్యకరమైన కంటెంట్‌పై చర్యలు చేపట్టింది. 600 అకౌంట్లు క్లోజ్ చేసింది. దాదాపు 3500 పోస్టులు బ్లాక్ చేసింది.

# సత్తుపల్లిలో భారీ సైబర్ దోపిడీ

### 18మంది నిందితుల అరెస్ట్ .. రూ.547 కోట్ల ఘరానా మోసం

### అంతర్జాతీయ సైబర్ నేరాల ముఠా గుట్టురట్టు



**సత్తుపల్లి, మహా:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి కేంద్రంగా సాగుతున్న భారీ అంతర్జాతీయ సైబర్ నేరాల ముఠాను పోలీసులు గుట్టురట్టు చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన పేరుతో వల విసిరి, సుమారు 547 కోట్ల రూపాయల మేర మోసాలకు పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదివారం పెనుబల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. గత నెల 24వ తేదీన సత్తుపల్లి మండలం తుంబూరు గ్రామానికి చెందిన మోదుగ సాయికిరణ్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ భారీ ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఈ ఫిర్యాదు పై లోతుగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు, సత్తుపల్లికి చెందిన పోట్రు మనోజ్ కళ్యాణ్, ఉడతనేని వికాస్ చౌదరి నేతృత్వంలోని గ్యాంగ్ ఈ వ్యవస్థీకృత నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ ముఠాకు వివిధ రూపాల్లో సహకరించిన మరో 18 మందిని పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు.

**విస్తుపోయేలా బ్యాంక్ లావాదేవీలు**

కేసు విచారణలో భాగంగా నిందితులు, వారి కుటుంబ సభ్యులు, అనుచరుల బ్యాంక్ ఖాతాలను పరిశీలించిన పోలీసులకు దిగ్భ్రాంతి కలిగించే అంశాలు వెల్లడయ్యాయి. ప్రధాన నిందితుడు పోట్రు మనోజ్ కళ్యాణ్ ఖాతాలో రూ.114.18 కోట్లు, అతని భార్య మేడా భానుప్రియకు చెందిన రెండు ఖాతాల్లో రూ.45.62 కోట్లు, మనోజ్ బామ్మర్ది మేడా సతీష్ ఖాతాలో రూ.135.48 కోట్లు ఉన్నట్లు గుర్తించారు. అలాగే బొమ్మిడాల నాగలక్ష్మి ఖాతాలో రూ.81.72 కోట్లు, కరీంనగర్‌కు చెందిన తాటికొండ రాజుకు చెందిన నరసింహా కిరాణం అండ్ డెయిరీ ఖాతాలో రూ.92.54 కోట్లు, మరో ప్రధాన నిందితుడు ఉడతనేని వికాస్ చౌదరి ఖాతాలో రూ.80.41 కోట్ల భారీ లావాదేవీలు జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు.

**నిరుద్యోగుల ఖాతాలే పెట్టుబడిగా**

ఈ ముఠా అనుసరించిన మోసపూరిత విధానం అత్యంత ప్రమాదకరంగా ఉంది. నిందితులు మొదట సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగ యువకులకు ఉద్యోగాల ఆశ చూపి వారిని పిలిపించుకునేవారు. అనంతరం వారితో ప్రముఖ బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించి, ఆ ఖాతాలకు సంబంధించిన కీలక సమాచారాన్ని తమ ఆధీనంలోకి తీసుకునేవారు. ఆ ఖాతాలనే సైబర్ నేరాల ద్వారా వచ్చిన కోట్లాది రూపాయల సొత్తును దాచడానికి వినియోగించేవారు. అంతర్జాతీయ సైబర్ నేరస్థులతో సంబంధాలు కలిగి ఉన్న ఈ ముఠా, విదేశాల నుంచి కాల్ సెంటర్లు నిర్వహిస్తూ పెట్టుబడులు, మ్యాట్రిమోనీ, రివార్డు పాయింట్లు, ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, షేర్ మార్కెట్, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేరుతో దేశవ్యాప్తంగా అమాయక పౌరులను బురిడీ కొట్టిస్తోంది. బాధితులను టెలిగ్రామ్ గ్రూపుల్లో చేర్చి, మోసపూరిత లింకుల ద్వారా వారి ఖాతాలను పూర్తిగా ఖాళీ చేస్తున్నారు.

**క్రిప్టో కరెన్సీ రూపంలోకి నగదు మళ్లింపు..**

నేరాల ద్వారా వచ్చిన సొమ్మును గుట్టుచప్పుడు కాకుండా మళ్లించడంలో నిందితులు ఆరితేరిపోయారు. మొదట ఏజెంట్ల ద్వారా తెరిపించిన బ్యాంక్ ఖాతాల్లోకి సొమ్మును బదిలీ చేసి, అక్కడి నుండి కొన్ని కరెంట్ ఖాతాలకు మళ్లించేవారు. చివరగా ఆ డబ్బును తమ వ్యక్తిగత ఖాతాల్లోకి చేర్చి, యూఎస్ డాలర్లు, క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఇప్పటికే పోట్రు ప్రవీణ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు సహకరించిన ఇతర వ్యక్తులు, మరిన్ని బ్యాంకు ఖాతాల వివరాల కోసం క్షేత్రస్థాయిలో దర్యాప్తు కొనసాగుతోందని పోలీస్ కమిషనర్ తెలిపారు. నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా యువత ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో నేరస్థుల వలలో పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు.




# ఎయిర్ పోర్టుల్లో చౌక టీ

- ఉడాన్ యాత్రి కెఫే ఆరంభం
- సామాన్య విమాన ప్రయాణికులకు వరం
- పది రూపాయలకే టీ, రూ. 20కే కాఫీ
- అతి తక్కువ ధరలకే స్నాక్స్ అందుబాటులోకి

**మహా:** సామాన్య విమాన ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించే దిశగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా తీసుకున్న కీలక నిర్ణయం కార్యరూపం దాల్చింది. శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం లో 'ఉడాన్ యాత్రి కెఫే' శనివారం నుంచి తన సేవలను ప్రారంభించింది. విమానాశ్రయాల్లో ఆహారం, పానీయాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, సామాన్యుడు కనీసం టీ తాగే పరిస్థితి కూడా లేదని ప్రయాణికులు గత కొంతకాలంగా ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ అంశం పార్లమెంటులో కూడా చర్చకు రావడంతో, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తక్కువ ధరల కెఫేలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే గతేడాది జనవరిలో కోల్‌కతాలో తొలి కెఫే ప్రారంభం కాగా, ఇప్పుడు హైదరాబాద్‌లో రెండోది అందుబాటులోకి వచ్చింది. ఈ కెఫేలో టీ కేవలం రూ. 10లకే లభిస్తుండగా, కాఫీ రూ. 20లకు అందిస్తున్నారు. ప్రయాణికులు విమానం ఎక్కేముందు నామమాత్రపు ధరలకే అల్పాహారం, స్నాక్స్ కూడా ఇక్కడ తీసుకోవచ్చు. "ప్రయాణికుల సేవల నాణ్యతను పెంచడంలో ఉడాన్ యాత్రి కెఫే ఒక ప్రధాన అడుగు" అని విమానాశ్రయ అధికారులు సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వెల్లడించారు. అంతర్జాతీయ ప్రయాణికుల చెకిన్ హాల్ గేట్ నంబర్ 1 వద్ద ఉన్న ఈ కెఫే పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మునిసిపల్ ఎన్నికల నగారా

(మొదటిపేజీ తరువాయి)

ఇన్ ఛార్జిలు ప్రకటించనున్నారు. సీనియర్, జూనియర్ కాకుండా గెలుపుగుర్రాలకే టికెట్లు ఇవ్వాలని అధిష్టానం నిర్ణయించింది. మునిసిపాలిటీలలో బీసీలకు అధికసీట్లు లబించే అవకాశాలున్నాయి. ఎస్సీ,ఎస్టీ జనాభా పట్టణాల్లో తక్కువగా ఉండడంతో 34శాతం సీట్లు బీసీలకు దక్కనుండగా, పార్టీపరంగా మరో 10శాతం అదనంగా కేటాయించాలని కాంగ్రెస్ భావిస్తోంది. గ్రామపంచాయతీలలోనూ బీసీలకు అధిక పంచాయతీలు దక్కాయి.

**జిల్లాలకు సీఎం?**

ఫిబ్రవరి 3 నుండి సీఎం జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టాలని భావించారు. ఈ నెల 19 నుండి 23 వరకు సీఎం దావోస్ లో పర్యటించనున్నారు. జనవరి 28 నుండి 31 మధ్య మేడారం జాతర జరగనుంది. పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో సంక్రాంతి నుండే సీఎం మునిసిపల్ నగారా మోగించబోతున్నారు. ఈనెల 16న నిర్మల్ లో పర్యటించనున్న సీఎం రేవంత్, 17న వరంగల్ జిల్లాలో, 18న ఖమ్మం జిల్లాల్లో సభలలో పాల్గొననున్నారు. దావోస్ నుండి వచ్చాక ఇతర జిల్లాల సభల్లో సీఎం పాల్గొనే అవకాశముంది.

**ఖమ్మం, వరంగల్ కు ముందస్తు?**

ఖమ్మం కార్పోరేషన్ కు మేలో ఎన్నికలు జరిగాల్సి ఉంది. ఇటీవల సీఎంను కలిసిన కార్పోరేటర్లు ఖమ్మం కార్పోరేషన్ కు కూడా ఫిబ్రవరిలోనే ఎన్నికలు జరపాలని విజ్ఞప్తిచేశారు. వరంగల్, ఖమ్మంతో పాటు ఏడు మునిసిపాలిటీలకు మేలో ఎన్నికలు జరగాల్సి ఉండగా, అన్నీ ఒకేసారి పూర్తిచేయాలన్న యోచనలో అధికారపార్టీ ఉంది. అయితే వీటిపై స్పష్టత రావాల్సి ఉంది. మొత్తంగా మునిసిపల్ ఎన్నికల నగారా మోగిస్తున్న సీఎం రేవంత్ కార్పోరేషన్లు, మునిసిపాలిటీలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు.

# యుద్ధప్రాతిపదికన ఎస్ఎల్బీసీ సొరంగం పనులు

- ఈ ఏడాదే ప్రాజెక్టు పూర్తిచేస్తాం
- టీబీఎం స్థానంలో ఆధునిక టెక్నాలజీ వినియోగం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**మహా:** నల్గొండ జిల్లా ఫ్లోరోసిస్ సమస్యకు శాశ్వత పరిష్కారమైన ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. సచివాలయంలో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. మిగిలి ఉన్న 9.8 కిలోమీటర్ల తవ్వకాల్లో టీబీఎం యంత్రాలకు బదులుగా ఆధునిక సాంకేతికతను వాడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎలక్ట్రో మాగ్నెటిక్ సర్వే పూర్తి చేశామని.. పనుల వేగం పెంచేందుకు సొరంగం ఇరువైపుల నుండి తవ్వకాలు చేపడుతున్నామని చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బందికి 25 శాతం అదనపు వేతనం ఇస్తామని.. ప్రతి సోమవారం పనుల పురోగతిని పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును 2026 నాటికి పూర్తి చేయాలనే పట్టుదలతో ఉంది. అయితే క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి 25 శాతం అదనపు జీతాలు ఇవ్వనున్నట్లు మంత్రి ప్రకటించారు. అలాగే పనుల పర్యవేక్షణ కోసం ప్రతి సోమవారం సమీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ సొరంగం పూర్తయితే నల్గొండ జిల్లాలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు.. ఫ్లోరోసిస్ భూతం నుంచి జిల్లాకు శాశ్వత విముక్తి లభించనుంది.

# సీఎం పాలనపై దృష్టి పెట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

ఈ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయడం లేదని ఈ సందర్భంగా కేటీఆర్ ఆరోపించారు. ఈ హామీలు ఎందుకు అమలు చేయడం లేదంటూ నిన్నమొన్నటి వరకు ప్రశ్నిస్తే.. సీఎం రేవంత్ రెడ్డి నవ్వేవారని.. ఇక్కడ లంకెబిందెలు ఉంటాయని తాను వచ్చానని.. కానీ అవి ఇక్కడ లేవని రేవంత్ చెప్పారని కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్ పరిధిలో ఒక్క ఇందిరమ్మ ఇల్లూ ఆయన కట్టలేదన్నారు. రేవంత్‌రెడ్డి ఇల్లు కట్టే వ్యక్తి కాదని కూలగొట్టే వ్యక్తి అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. గరీబ్ వాళ్ల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని కూలగొడతారంటూ రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు. పార్టీ మారిన 10మంది ఎమ్మెల్యేలపై ఈ సందర్భంగా కేటీఆర్ నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్‌లో ప్రకాష్‌గౌడ్ ఉంటే.. పార్టీ కార్యక్రమానికి ఎందుకు రాలేదంటూ సందేహం వ్యక్తం చేశారు. పందిలాగా వందేళ్లు బతకొద్దు.. నంది లెక్క నాలుగేళ్లు బతికినా చాలు అంటూ పార్టీ మారిన ఎమ్మెల్యేలను ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు. రెండేళ్లలో చేసిన మోసం చాలని.. పాలనపై దృష్టి పెట్టాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఈ సందర్భంగా హితవు పలికారు.

## అత్యంత అరుదైన ఘనత

# సాధించిన పవన్ కళ్యాణ్

### పురాతన జపనీస్ కత్తిసాము కళ 'కెంజుట్సు'లో అధికారికంగా ప్రవేశం

### జపనీస్ మార్షల్ ఆర్ట్స్ లో చారిత్రాత్మక ప్రపంచ గుర్తింపు పొందిన పవన్ కళ్యాణ్



**అమరావతి, మహా :** పవన్ కళ్యాణ్ బహుముఖ ప్రజ్ఞాశాలి. సినీ రంగంలో నటుడిగా చెరగని ముద్ర వేశారు. నటుడిగా మాత్రమే కాకుండా రచయితగా, దర్శకుడిగా, స్టంట్ కోఆర్డినేటర్ గా, కొరియోగ్రాఫర్ గా, గాయకుడిగా ఇలా పలు విభాగాల్లో తన ప్రతిభను చాటుకున్నారు. అలాగే రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రజా నాయకుడిగా మన్ననలు పొందుతున్నారు. మార్షల్ ఆర్ట్స్ లోనూ ప్రావీణ్యులైన పవన్ కళ్యాణ్, ఓ అరుదైన ఘనతను ఖాతాలో వేసుకున్నారు. ప్రాచీన జపనీస్ కత్తిసాము కళ అయిన 'కెంజుట్సు'లో అధికారికంగా ప్రవేశం పొందడం ద్వారా ఒక గొప్ప అంతర్జాతీయ గౌరవాన్ని సాధించారు. మూడు దశాబ్దాలకు పైగా ఆయన క్రమశిక్షణతో సాగించిన సాధన, పరిశోధన, మార్షల్ ఆర్ట్స్ పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనంగా ఈ అరుదైన ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది.

సినిమాలు, రాజకీయాల్లోకి ప్రవేశించకముందే పవన్ కళ్యాణ్ మార్షల్ ఆర్ట్స్ ప్రయాణం ప్రారంభమైంది. కరాటే మరియు సంబంధిత యుద్ధకళల పట్ల అమితమైన ఆసక్తి కలిగిన పవన్ కళ్యాణ్, చెన్నైలో ఉన్న సమయంలో కఠినమైన శిక్షణతో పాటు నిరంతర సాధన చేసి, సాంకేతికంగా మరియు తాత్వికంగా బలమైన పునాది ఏర్పరుచుకున్నారు. కాలక్రమేణా, శారీరక సాధనకే పరిమితం కాకుండా, జపనీస్ సమురాయ్ మార్షల్ సంప్రదాయాలపై లోతైన అధ్యయనం చేసి, పరిశోధించి, అత్యంత నిబద్ధతతో వాటిని అనుసరించారు. మార్షల్ ఆర్ట్స్ పై ఆయన అవగాహన సినిమాల రూపంలోనూ ప్రతిబింబించింది. అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి, తమ్ముడు, ఖుషి, అన్నవరం, ఓజీ వంటి చిత్రాల ద్వారా ఈ మార్షల్ కళలను తెరపై ప్రదర్శిస్తూ, వాటికి విస్తృత గుర్తింపు మరియు ప్రజాదరణ తీసుకొచ్చారు. మార్షల్ ఆర్ట్స్ పట్ల ఆయన చూపిన నిరంతర, దీర్ఘకాలిక అంకితభావాన్ని గుర్తించిన అంతర్జాతీయ సంస్థలు, పవన్ కళ్యాణ్‌కు పలు ప్రతిష్ఠాత్మక గౌరవాలు అందించాయి. జపాన్ సంప్రదాయ యుద్ధకళల్లో అత్యంత గౌరవనీయమైన సంస్థలలో ఒకటైన 'సోగో బుడో కన్‌రి కై' నుంచి ఆయనకు ఫిఫ్త్ డాన్ (ఐదవ డాన్) పురస్కారం లభించింది. అలాగే, జపాన్ వెలుపల 'సోకే మురమత్సు సెన్సె'లోని 'టకెడా షింగెన్ క్లాన్'లో ప్రవేశం పొందిన తొలి తెలుగు వ్యక్తిగా ఆయన నిలిచారు. ఇది జపాన్ వెలుపల చాలా అరుదుగా లభించే గౌరవం. అంతే కాకుండా, గోల్డెన్ డ్రాగన్స్ సంస్థ ద్వారా ఆయనకు "టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్" అనే విశిష్ట బిరుదుతో సత్కారం కూడా జరిగింది.

అధునాతన శిక్షణలో భాగంగా, భారతదేశంలో జపాన్ యుద్ధకళలలో అగ్రగణ్యులలో ఒకరైన ప్రముఖ బుడో నిపుణుడు హాన్షి ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధిక్ మహ్మూదీ వద్ద పవన్ కళ్యాణ్ శిక్షణ పొందారు. ఆయన మార్గదర్శకత్వంలో పవన్ కళ్యాణ్ 'కెండో'లో సమగ్ర శిక్షణ పొంది, ఉన్నత స్థాయి సాంకేతిక నైపుణ్యం మరియు లోతైన తాత్విక అవగాహనను సంపాదించారు.ఈ మైలురాయి ద్వారా సినిమా, శాస్త్రీయ యుద్ధకళలు, యుద్ధ తత్వశాస్త్రం.. ఈ మూడింటినీ అంతర్జాతీయ వేదికపై సమన్వయం చేయగలిగిన అతి కొద్దిమంది భారతీయ ప్రముఖుల్లో ఒకరిగా పవన్ కళ్యాణ్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. యుద్ధకళ సాధకులు, అభిమానుల దృష్టిలో కెంజుట్సులో పవన్ కళ్యాణ్ ప్రవేశం అనేది కేవలం ఒక గౌరవం మాత్రమే కాదు.. క్రమశిక్షణ, వినయం, నిరంతర అభ్యాసం వంటి విలువలతో నిండిన జీవిత కాల ప్రయాణానికి ప్రతిబింబం. ఈ విలువలు మార్షల్ ఆర్‌టిస్‌కు మాత్రమే కాకుండా పవన్ కళ్యాణ్ వ్యక్తిగత సిద్ధాంతాలకు కూడా లోతుగా అనుసంధానమై ఉన్నాయి.

# రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం..

## త్వరలోనే ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేరుస్తాం..

ప్రజల జీవన ప్రమాణాలు పెంపుకు ప్రభుత్వం కృషి.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
అర్హులైన పేదలకు రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు
96 లక్షల కుటుంబాలకు రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా
5 లక్షల ప్రభుత్వ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా అమలు
పేదలకు అండగా ఉన్న ఇందిరమ్మ ప్రభుత్వాన్ని ప్రజలు బలోపేతం చేయాలి
రామగుండంలో డిప్యూటీ సీఎం మంత్రుల పర్యటన.. పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం..
లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేసిన డిప్యూటీ సీఎం మంత్రులు




**కరీంనగర్ మహా :** ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆదివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దుదిల్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ప్రభుత్వ సలహాదారు హర్క వేణుగోపాల్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు, జే .అరుణ శ్రీ డి. వేణు, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్,తో కలిసి రామగుండంలో పర్యటించి నగరంలో వివిధ డివిజన్ లలో 80 కోట్ల 52 లక్షల రూపాయలతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు, టి.యూ.ఎఫ్.ఐ.డి ద్వారా 88 కోట్ల 90 లక్షల రూపాయలతో చేపట్టనున్న నీటి సరఫరా పైప్ లైన్ నిర్మాణ సరఫరా, ఆర్&బీ శాఖ ద్వారా చేపట్టనున్న 6.5 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం నగరంలో నిర్మించిన 633 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు ,494 ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రామగుండం జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో *డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ఢిల్లీలో బడ్జెట్ తయారీ సంబంధిత సమావేశం ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే పట్టుబట్టి ఈ కార్యక్రమానికి తనను రప్పించారని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని పని చేయడం ప్రజా ప్రతినిధులు ఉండాల్సిన కీలకమైన అంశమని, రాష్ట్ర క్యాబినెట్ లోని మంత్రులందరిపై ఒత్తిడి పెంచుతూ రామగుండం ప్రాంతానికి అవసరమైన పనులు స్థానిక ఎమ్మెల్యే చేయించుకుంటున్నారని డిప్యూటీ సీఎం ప్రశంసించారు.

గత పాలకులు పేదలకు వ్యతిరేకంగా పని చేశారని , ప్రజల కష్టాలను చూసి ప్రతిపక్ష నాయకుడిగా ఆ రోజులలో ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పీపుల్స్ మార్చ్ పేరిట పాదయాత్ర నిర్వహించి, ఈ ప్రాంత సమస్యలను ఆనాడే గుర్తించడం జరిగిందని అన్నారు. పేద ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే విధంగా ప్రజా ప్రభుత్వం మొదటి సంవత్సరమే 22 వేల 500 కోట్లతో 4 లక్షల 50 వేల ఇండ్లు మంజూరు చేసిందన్నారు.

పేదలు ఆత్మగౌరవంతో జీవించాలని లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని చెప్పారు. పేద ప్రజలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకొని గృహప్రవేశం చేసినప్పుడే ప్రభుత్వానికి సంతోషం ఉంటుందని అన్నారు. 96 లక్షల కుటుంబాలకు ప్రభుత్వం లబ్ధిదారుడికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం ప్రతినెల ఉచితంగా సరఫరా చేస్తుందని అన్నారు.

29 లక్షల వ్యవసాయ పంప్ సెట్లకు 24 గంటల త్రీ ఫేస్ విద్యుత్తు , 52 లక్షల పైగా నిరుపేద కుటుంబాలకు 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, 8600 కోట్ల రూపాయలు ఖర్చు చేసి మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని అన్నారు.

పేద మధ్య తరగతి కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని పాలన కొనసాగిస్తున్నామని అన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ ఆర్థిక శక్తిగా తెలంగాణ అభివృద్ధి చెందాలని లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పాలకుర్తి ఎత్తిపోతల పథకం పనులు త్వరలో చేపడతామని అన్నారు.

స్థానికంగా రామగుండం ప్రాంత ప్రజలకు థర్మల్ పవర్ ప్రాజెక్ట్ తో భావోద్వేగ సంబంధం ఉందని, ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్ బాబు కృషి మేరకు రాష్ట్ర క్యాబినెట్ రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి ఆమోదం తెలిపిందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ త్వరలోనే నెరవేరుస్తామని ప్లాంట్ నిర్మాణానికి వేగవంతంగా చర్యలు చేపడుతున్నామని ప్రకటించారు. శ్రీపాద ఎల్లంపల్లి ,ఎన్టిపిసి , సింగరేణి, కేశోరాం సిమెంట్స్, ఎరువుల కర్మాగారం వంటి ప్రాజెక్టుల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రామగుండం ప్రాంతంలో 10 సంవత్సరాలపాటు ఎటువంటి ప్రాజెక్టులు గత పాలకుల హాయంలో తేలేదని డిప్యూటీ సీఎం విమర్శించారు. సింగరేణి కాలరీస్ సంస్థ కాపాడేందుకు రేర్ ఎర్త్ మెటీరియల్స్ మైనింగ్ లో కూడా భాగస్వామ్యం అయ్యేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. సింగరేణి కార్మికులకు, జెన్ కో, డిస్కంలో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వం కోటి రూపాయల ప్రమాద బీమా కల్పించిందని, అదే రీతిలో రాష్ట్రంలో పనిచేసే ఐదు లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు కూడా కోటి రూపాయల బీమా ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు.

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ,**

పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి మాట నెర వేరుస్తున్నామని అన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉగాది నుంచి పేదలకు సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశామని అన్నారు. గత పాలకుల హయాంలో పేదల కోసం ఇల్లు నిర్మించ లేదని వారి కోసం మాత్రం పెద్ద పెద్ద భవనాలు కట్టుకున్నారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 22 వేల 500 కోట్లతో మొదటి విడతలో 4 లక్షల 50 వేల ఇండ్లు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. రాజకీయాలకతీతంగా నిరు పేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేశామని, రాబోయే 3 సంవత్సరాలలో మరో మూడు విడతలుగా ఇండ్లు ఇస్తామని అన్నారు. కక్ష సాధింపు చర్యలకు తమ ప్రభుత్వం దూరంగా ఉంటుందని గత ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారుల పేర్లు మార్చకుండా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మౌలిక వసతులు కల్పించి అందిస్తున్నామని అన్నారు.కార్పొరేషన్ పరిధిలో మరో తహసిల్దార్ నియమించే దిశగా క్యాబినెట్ లో అవసరమైన నిర్ణయం త్వరలో తీసుకుంటామని తెలిపారు.

రైతన్నలకు 21 వేల కోట్ల రుణమాఫీ ఏకకాలంలో చేశామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, సన్న వడ్లకు ప్రభుత్వం 500 రూపాయల బోనస్ అందించామని తెలిపారు. మొండి గోడలుగా ఉన్న 633 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను రామగుండం నగరంలో నేడు పంపిణీ చేస్తున్నామని, మరో 300 ఇండ్లకు లబ్ధిదారులను ఫైనల్ చేస్తే వారికి నిధులు కేటాయించి పెండింగ్ పనులు పూర్తి చేయించే కార్యక్రమం చేపడతామని అన్నారు.

1717 లబ్ధిదారులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూం ఇండ్లు నేడు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సింగరేణి పరివాహక ప్రాంతంలో సింగరేణి కార్మికుల ఇంటి స్థలాలు క్రమబద్ధికరించేందుకు గతంలో వైయస్సార్ జారీ చేసిన 76 ఉత్తర్వులను నేడు మరోసారి అమలు చేసి అర్హులైన కార్మికులకు తప్పనిసరిగా ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి వర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, రామగుండం ప్రాంతంలో ఉన్న నిరుపేదలు, యువకులు, కార్మికులకు మంచి చేయాలని ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే నిరంతరం పని చేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. చివరి ఆయకట్టుకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే పని చేస్తున్నారని చెప్పారు. నగరంలో రోడ్డు వెడల్పు పనుల వల్ల నష్టపోయే నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాణిజ వ్యాపార సంస్థలు నగరంలో వృద్ధి చెందాలని లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. నేడు 600 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు నాంధి పలికామని అన్నారు. ఇందిరమ్మ కమిటీ లు ఏర్పాటు చేసి పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసి 479 మంది అర్హులకు నేడు ప్రొసీడింగ్ కాపీలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. అర్హత ఉండి ఇండ్లు రానివారు ఎవరు ఆందోళన చెందవద్దని, రాబోయే దశలలో మరిన్ని ఇండ్లు మంజూరు అవుతాయని అన్నారు. మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి 10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, నూతన రేషన్ కార్డుల జారీ, రేషన్ ద్వారా ప్రతి లభిదారుడుకు నెలకు 6 కిలోల సన్న రకం బియ్యం సరఫరా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

800 మెగా వాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం జన్ కో లేదా ఎన్.టి.పి.సి ద్వారా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. వైయస్సార్ హయంలో 18 వేల ఇండ్లకు క్రమబద్ధీకరణ పట్టాలు పంపిణీ చేశామని, పెండింగ్ దరఖాస్తులను త్వరలోనే పరిశీలించి పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను వక్రీకరిస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా చేస్తున్న అబద్ధపు ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నగరంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా తప్పనిసరిగా పరిష్కరిస్తామని అన్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, వెనుకబడిన రామగుండం ప్రాంతం అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. వైయస్సార్ హయాం నుంచి సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి ప్రారంభమైందని అన్నారు. రాష్ట్రానికి అతి పెద్ద సంపద సింగరేణి సంస్థ , అర్హులైన సింగరేణి కార్మికులకు ఇంటి స్థలాలు అందించాలని రెవెన్యూ శాఖ మంత్రివర్యులను మంత్రి విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టులకు సొంతిల్లు నిర్మిస్తామని గతంలో కేసీఆర్ మోసం చేశారని, మన ప్రజా ప్రభుత్వం చిత్ర స్థాయిలో పనిచేసే ప్రతి అర్హులైన జర్నలిస్టులకు సొంత ఇండ్లు మంజూరు చేస్తుందని మంత్రి తెలిపారు. సమాజంలో చిన్న చూపు ఉన్న ట్రాన్స్ జెండర్లకు పెన్షన్ మంజూరు చేయాలని గత ప్రభుత్వంలో అసెంబ్లీలో ప్రశ్నించినప్పటికీ అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని, మన ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు రామగుండంలో ఆలయాల అభివృద్ధి కోసం సుమారు మూడు కోట్ల రూపాయలు దేవాదాయ శాఖ తరపున మంజూరు చేస్తామని, అవసరమైన మరిన్ని నిధులు ముఖ్యమంత్రి ఎస్. డి ఎఫ్ నుంచి మంజూరు చేసుకునేందుకు కృషి చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమ కార్యక్రమాల చేస్తూనే ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పై దృష్టి సారించిందని అన్నారు. రామగుండం నగర సర్వతో ముఖాభివృద్ధికి ఎమ్మెల్యే చిత్తశుద్ధితో పని చేస్తున్నారని అన్నారు. సింగరేణి మెడికల్ బోర్డు నుంచి కార్మికులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. చిన్నతనంలో తాము చదువుకున్న పాఠశాలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయాలని అన్నారు. ఎస్సీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని ప్రతిపాదనలు పంపాలని మంత్రి ఎమ్మెల్యే కు సూచించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, 10 నుంచి 15 సంవత్సరాలు పెండింగ్ ఉన్న అంశాలను పరిష్కరించి నేడు 1700 పైగా నిరుపేద కుటుంబాలకు వివిధ పథకాల ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు.

మేడిపల్లి గ్రామంలో దారిద్ర రేఖ దిగివకు ఉన్న 212 నిరుపేద కుటుంబాలకు, జనగామ గ్రామంలో 31 మంది ట్రాన్స్ జెండర్లకు, గోదావరిఖనిలో వరద ప్రభావిత ప్రాంతాలకు చెందిన 129 మంది పేద కుటుంబాలకు, మారేడు పాక గ్రామంలో చాలా కాలంగా పెండింగ్ ఉన్న సింగరేణి భూ సమస్య పరిష్కారం చేసి 162 కుటుంబాలకు, జిఓ 76 పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించి పట్టాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు.

నేడు పట్టాలు పంపిణీ చేసిన 633 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులు 2 నెలల లోపు గృహప్రవేశం చేసే విధంగా
అవసరమైన డ్రైనేజీ, ఇతర మౌలిక వసతులు కల్పిస్తామని అన్నారు. రామగుండం నగర వ్యాప్తంగా 494 మంది నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలను అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

ఇళ్ల పట్టాల పంపిణీ మాత్రమే కాకుండా రామగుండం నగర అభివృద్ధి కోసం 169 కోట్ల పైగా నిధులతో చేపట్టిన త్రాగునీటి సరఫరా, సివరేజ్ ప్లాంట్ల నిర్మాణం వంటి పనులకు శంకుస్థాపన చేసుకున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల కాలంలో రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో 562 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు

*రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, గత 10 సంవత్సరాల పాటు రామగుండం నగరాన్ని అప్పటి పాలకులు నిర్లక్ష్యానికి గురి చేశారని అన్నారు. 800 మెగా వాట్ల థర్మల్ విద్యుత్ కేంద్ర ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను ప్రభుత్వం గుర్తించి సంస్థ లాభాల్లో వాటా కింద బోనస్ అందించిందని అన్నారు. మేడిపల్లి లో పీపీఏ పద్దతులో విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అన్నారు.

గతంలో వైఎస్ఆర్ 18 వేల నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేశారని, మరో 7 వేల పేదలకు పట్టాల పంపిణీ అవసరం ఉందని అన్నారు. రామగుండం నగరంలో మరో తహసిల్దార్ కార్యాలయం, జూనియర్ కళాశాల భవనం అవసరం ఉందని , వెంటనే మంజూరు చేయాలని కోరారు. ట్రాన్స్ జెండర్ సంక్షేమం కోసం ప్రభుత్వం మొదటి సారి హైదరాబాద్ లో ట్రాఫిక్ పోలీస్ ఉద్యోగం అందించారని, నేడు మన రామగుండం లో మరో 50 మంది ట్రాన్స్ జెండర్ లకు ఇంటి పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. రామగుండం జనరల్ ఆసుపత్రి నిర్మాణానికి మరో 50 కోట్ల మంజూరు చేసి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అన్నారు. వ్యాపార, వైద్య, పర్యాటక కేంద్రంగా రామగుండం అభివృద్ధి చేస్తామని తెలిపారు. రామగుండం లో దేవాలయాలను పురావస్తు శాఖ ద్వారా 12 కోట్ల అభివృద్ధి చేయాలని కోరారు. నగరంలో నిర్మించిన 700 ఇండ్లకు మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు పంపిణీ చేశామని, పెండింగ్లో ఉన్న మరో 150 ఇండ్లకు నిదుర మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అంతర్గా లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేసామని, అదే విధంగా ప్రభుత్వం పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు 450 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, డిపిఆర్ తయారీ పనులు వేగవంతం చేయించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డి.వేణు, జే.అరుణశ్రీ, డిసిపి రాంరెడ్డి, రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, పిడి హౌసింగ్ రాజేశ్వరరావు,ప్రజా ప్రతినిదులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ పోలీసుల పనితీరును ప్రశంసించిన సీఎం చంద్రబాబు నాయుడు

## పోలీసుల అదుపులో మహిళపై దాడి కేసు నిందితుడు.. స్పష్టమైన ఆధారాలు లేకున్నా కేసు ఛేదించిన పోలీసులు

## విశాఖ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీస్తే సహించేది లేదన్న సీఎం

**విశాఖ, మహా:** విశాఖపట్నంలో ఓ మహిళపై జరిగిన దాడి వెనుక వాస్తవాలను ఛేదించి, నిందితుణ్ని అదుపులోకి తీసుకున్న విశాఖ నగర పోలీసులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. రెండు రోజుల క్రితం విశాఖలో విజయదుర్గ అనే మహిళను జగదాంబ సెంటర్‌లో ఓ వ్యక్తి దాడి చేసి, దుర్భాషలాడినట్టు ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై తక్షణమే స్పందించిన పోలీసులు... ఈ ఘటనకు కారణమైన వ్యక్తిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అయితే అతని మానసిక పరిస్థితి బాగోలేదని ప్రాథమిక విచారణలో తేలింది. సంఘటన సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించి, వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం, నిందితుడి గుర్తింపు వివరాలు తెలియకపోయినా, కేసును ఛేదించడంపై బాధిత మహిళ సంతృప్తి వ్యక్తం చేశారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించారని చెప్పారు. సదరు మహిళ స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి, ఆ వ్యక్తి మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారని నిర్ధారించుకున్నారు. అతన్ని మానసిక ఆసుపత్రిలో చేర్పించాలని కోరారు. అలాగే నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవద్దని బాధితురాలు విజ్ఞప్తి చేశారు. విశాఖలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయనేందుకు ఇది నిదర్శనమని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసుల పనితీరును ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రజల భద్రతకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. మహిళలకు రక్షణ విషయంలో దేశంలోనే విశాఖ మొదటి స్థానంలో ఉందని, భవిష్యత్‌లోనూ ఎటువంటి ఘటనలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. ఇదే సమయంలో ఇలాంటి ఘటనలపై రాజకీయం చేస్తూ, ప్రభుత్వంపై బురద జల్లాలని ప్రయత్నించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విశాఖ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.




# జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ ఫ్లెక్సీల ఏర్పాటు

## అన్ని మున్సిపాలిటీలలో పార్టీ అభ్యర్థులను నిలబెడుతుంది

## జాతీయ ఉపాధ్యక్షులు, తెలంగాణ ఇన్చార్జ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు

**హుజూర్ నగర్ మహా:** సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గంలోని నేరేడుచర్ల మండల కేంద్రంలో జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు మరియు తెలంగాణ ఇన్చార్జ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పార్టీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ల చేతివృత్తుల వారి ఐక్యత తో పార్టీ పోటీ చేయడం జరుగుతుందని తమ పార్టీ న్యూఢిల్లీ రిజిస్టర్ అండ్ పొలిటికల్ పార్టీ గా నమోదైన పార్టీ అని గత ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో కూడా పోటీ చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలలో పోటీ చేయదలుచుకున్న అభ్యర్థులు తమను చారవాని 9399946240 సంప్రదించవచ్చునన్నారు.




# మనశంకరవరప్రసాద్ కు హిట్ టాక్

## ప్రీమియర్స్ లో ఆడియన్స్ ఖుష్ .. హిట్ కొట్టేశాం అని అభిమానుల పోస్టులు

**మహా:** అనిల్ రావిపూడి ఖాతాలో మరో హిట్ పడింది. మెగాస్టార్ చిరంజీవి మనశంకర్ వరప్రసాద్ ఫ్యామిలీ ఆడియెన్స్ ను మెప్పించేలా ఎంటర్టైనింగ్ ఉందని, చిరంజీవిలోని కామెడీ టైమింగ్ , డ్యాన్స్ గ్రేస్ ను అనిల్ బాగా వాడుకున్నారని.. ఫైనల్ సంక్రాంతి బొమ్మగా ఫ్యామిలీ ఆడియెన్స్ మెప్పిస్తుందని ప్రీమియర్స్ లో మూవీని చూసిన ఆడియెన్స్ ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. ప్రీమియర్స్ పడగానే ట్విట్వర్ రివ్యూలు కూడా పాజిటివ్ గా ఉన్నాయి. హుక్ స్టెప్ సాంగ్ కు థియేటర్లు ఊగిపోగా, హిట్ కొట్టేశాం అని మెగా అభిమానులు సంబరపడుతున్నారు.

# టాలీవుడ్ లో ఫస్ట్ టైం

## చిరంజీవి మన శంకర వరప్రసాద్ సినిమాకు కోర్టు రక్షణ

### ఫేక్ రేటింగ్స్, నెగెటివ్ ప్రచారాన్ని నిరోధించేందుకు కీలక ఆదేశాలు

### బుక్‌మైషోలో రేటింగ్స్, రివ్యూస్ ఫీచర్ తాత్కాలికంగా నిలిపివేత

**హైదరాబాద్, మహా :** మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా విడుదలకు ముందే ఒక అరుదైన చర్యతో వార్తల్లో నిలిచింది. ఆన్‌లైన్‌లో జరిగే ఫేక్ రివ్యూలు, వ్యవస్థీకృత నెగెటివ్ ప్రచారానికి అడ్డుకట్ట వేసేలా ఈ చిత్ర బృందం కోర్టు నుంచి కీలక ఆదేశాలు పొందింది. టాలీవుడ్‌లో ఒక సినిమాకు ఇలాంటి న్యాయపరమైన రక్షణ కవచం లభించడం ఇదే తొలిసారి. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం జనవరి 12న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. అయితే, ఇటీవలి కాలంలో సినిమాలను దెబ్బతీసేందుకు కొందరు బాట్లు, ఫేక్ అకౌంట్లతో రిలీజ్‌కు ముందే నెగెటివ్ రేటింగ్స్ ఇస్తున్న నేపథ్యంలో, నిర్మాతలు సుష్మితా కొణిదెల, సాహు గారపాటి ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. యాంటీ-పైరసీ సంస్థల సహాయంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ 'బుక్‌మైషో'లో ఈ సినిమాకు సంబంధించిన రేటింగ్స్, రివ్యూల విభాగాన్ని డిసేబుల్ చేయాలని ఆదేశించింది.

# బతకండి.. బతకనీయండి

## ఫేక్ రివ్యూలు.. నెగిటివ్ రేటింగ్స్ పై విజయ్

**హైదరాబాద్, మహా:** చిరంజీవి మూవీ మనశంకరవరప్రసాద్ కు కోర్టు రక్షణ లభించడంపై విజయ్ దేవరకొండ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బతకండి బతకనీయండి అంటూ నెగిటివ్ రేటింగ్స్ పై ఎమోషనల్ పోస్ట్ చేశారు. ''బుక్ మై షోలో ఇలా చూడటం ఒక రకంగా సంతోషంగా, మరో రకంగా బాధగానూ ఉంది. ఈ చర్యతో చాలా మంది కష్టం, కలలు, డబ్బును కాపాడుకునేందుకు దారి కనపడింది. ఇక విచారించాల్సిన విషయం ఏంటంటే, మన సొంత వాళ్లే ఇలాంటి సమస్యలు సృష్టిస్తున్నారు. 'బతకండి. బతనీయండి' అనే నినాదం ఏమైంది? అందరూ కలిసి ఎదగాలనే భావన ఎక్కడికి వెళ్లింది? 'డియర్ కామ్రేడ్' మూవీ సమయంలో వ్యవస్థీకృతమైన రాజకీయాలతో కూడిన ఇలాంటి దాడులు చూసి షాకయ్యా. నేను మాట్లాడిన ప్రతిసారి చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లు అయింది. పైగా ఒక మంచి సినిమాను ఎవరూ ఆపలేరని నాకే చెప్పేవారు. నాతో పని చేసిన దర్శకులు, నిర్మాతలకు ఈ సమస్య తీవ్రత అర్థమైంది'' ''ఎందుకోసం ఇదంతా చేస్తున్నారని ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపా. నా కలలను కాపాడుకునేందుకు వీళ్లతో ఎలా పోరాటం చేయాలా? అనుకున్నా. ఇన్నాళ్లకు ఈ విషయం బహిరంగంగా వచ్చినందుకు సంతోషిస్తున్నాను. మెగాస్టార్ లాంటి అగ్ర హీరో సినిమాకు కూడా ముప్పు ఉందని కోర్టు గుర్తించినందుకు ఆనందంగా ఉంది. కేవలం దీనితోనే సమస్యకు పూర్తి పరిష్కారం లభించదు. కానీ, ఉపశమనమైతే లభిస్తుంది. ఇదంతా పక్కనపెట్టి 'మన శంకరవరప్రసాద్ తో పాటు సంక్రాంతికి వస్తున్న అన్ని సినిమాలు విజయం సాధించాలని, ప్రేక్షకులను అలరించాలని కోరుకుందాం'' అని విజయ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశాడు.

# రిపబ్లిక్ డేకు ఖైదీల విడుదల

- జాబితా సిద్ధం చేసిన జైళ్ల శాఖ అధికారులు
- 70 మందికి క్షమాభిక్ష లభించే అవకాశం

**కుషాయిగూడ, మహా :** తెలిసో తెలియకో క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జైలు నాలుగు గోడల మధ్య ఎన్నో ఏళ్లుగా కారాగార జీవితాన్ని గడుపుతున్న జీవిత ఖైదీల విడుదల లిస్టును చర్లపల్లి చంచల్గూడా వరంగల్ కరీంనగర్ నిజామాబాద్ సంగారెడ్డి ఆయా సెంటర్ జైల్లో నుంచి సుమారు 70 మంది జీవిత ఖైదీల విడుదల లిస్టును జైళ్ల శాఖ ఉన్నత అధికారులకు పంపించారు. జైళ్ల శాఖ ఉన్నతాధికారులు హోంశాఖకు పంపించారు. ఇటీవల కాలంలో అత్యంతమైన దేశ న్యాయస్థానం సుప్రీంకోర్టు గైడ్లైన్స్ పర్మినెంట్ ఖైదీల విడుదల కోసం ఒక సంవత్సరంలో మూడుసార్లు విడుదల చేయాలని దేశంలో ఉన్న జైళ్ళకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను విడుదల చేసింది. సంవత్సర కాలంలో మూడుసార్లు జీవిత ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేయాలని ఆదేశించింది. నిందితులకు 14 సంవత్సరాలు వాస్తవిక శిక్ష నాలుగు సంవత్సరాలు రీమిషన్ భార్య హత్య కేసులో 12 సంవత్సరాల వాస్తవిక శిక్ష నాలుగు సంవత్సరాలు శిక్ష చిన్న పిల్లల హత్య కేసులలో 14 సంవత్సరాలు వాస్తవిక శిక్ష నాలుగు సంవత్సరాలు రిమిషన్ కిడ్నాపులు 14 సంవత్సరాలు వాసవిక శిక్ష నాలుగు సంవత్సరాలు రిమిషన్ గతంలో 10 సంవత్సరాలు వాసవిక శిక్ష మూడు సంవత్సరాలు రిమిషన్ ఉండేది. ఇప్పుడు సుప్రీంకోర్టు గైడ్లైన్స్ తో శిక్ష కాలాలలో మార్పులు చెందాయి ప్రభుత్వ ఉద్యోగిని చంపిన వారికి క్షమాభిక్ష ఉండదు. నక్సలైట్లు ఉగ్రవాదులు రౌడీషీటర్లు దేశద్రోహులు గంజాయి డ్రగ్స్ మత్తుపదార్థాలు మనుషుల అక్రమ రవాణా వారికి క్షమాభిక్ష ఉండబోదని సుప్రీంకోర్టు మార్గదర్శకాలలో వెల్లడించాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు వల్ల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 350 మంది జీవిత ఖైదీల విడుదలకు నోచుకోలేకపోతున్నారని జైలు వర్గాల ద్వారా తెలిసింది క్షమాభిక్షల విషయంలో తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వాలు కొర్రీలు పెట్టడం వల్లే ఎంతో మంది జీవిత ఖైదీల విడుదలకు నోచుకోలేకపోతున్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు మార్గదర్శకాల లో అసలైన జీవిత ఖైదీలకు అన్యాయం జరుగుతుందని అన్యాయం జరుగుతుందని జీవిత ఖైదీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా క్షమాభిక్షల ద్వారా విడుదలకు నోచుకోలేక తన యవ్వనాన్నంత గేరు నాలుగు గోడల మధ్యనే గడపాలిస్తుందని కన్నీరు మున్నీరు వినిపించారు. భార్యా పిల్లలకు దూరమై దూరమై ఏళ్ల తరబడి జైల్లోనే మగ్గిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు తెలుసు తెలియకో క్షణికావేశంలో నేరాలు చేసి జైల్లో ఉంటే తమ భార్య పిల్లలు కూడా శిక్షకు గురవుతున్నారని చర్లపల్లి ఖైదీలు అంటున్నారు తెలంగాణ జైళ్ల నుండి చర్లపల్లి 20 మంది జీవిత ఖైదీలు చర్లపల్లి వ్యవసాయ క్షేత్రం జైలు నుండి 15 మంది జీవిత ఖైదీలు చంచల్గూడా సెంట్రల్ జైలు నుంచి పదిమంది జీవిత ఖైదీలు వరంగల్ సెంట్రల్ జైలు నుంచి పదిమంది జీవిత ఖైదీలు కరీంనగర్ జైలు నుండి 6 మంది నిజామాబాద్ సెంటర్ జైల్ నుంచి 8 మంది సంగారెడ్డి సెంట్రల్ జైలు నుంచి 6 మంది ఖైదీల విడుదల జాబితా లిస్ట్ను జైళ్ల శాఖ ఉన్నత అధికారులకు తయారుచేసి పంపించారు ఖైదీల విడుదల లిస్టును హోం శాఖకు పంపించారు హోం శాఖ నుండి తెలంగాణ రాష్ట్ర గవర్నర్కు ఫైలు చేరుతుంది ఫైల్ పై గవర్నర్ సంతకం కాగానే ఖైదీల విడుదలకు ప్రభుత్వం నుండి. ఎప్పుడు ఎదురవుతామని చూస్తున్న ఖైదీలు 2026 జనవరి 26 రిపబ్లిక్ డే నా విడుదలవుతామని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.

మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 12-01-2026


# బుడగలు బుడగలుగా బురద

ఊరి బయట బావుల్లో దూకి
ఈదులాడిన,ఆ బర్రెగొడ్లు గాసే పిల్లోన్ని నేనే
ఊహల సముద్రాల పన్నీటిలో
ఆ బటర్ ఫ్లై స్ట్రోక్స్ నా చేతులవే
తేనెటీగల చురుకు గాట్లకు భయపడకుండా
ఈగలుదాచిన తేనెలలో తలమునకలయ్యిందీ
చేతులు కోసుగా ముందుకు చాచి
పల్చని రెక్కల్లాంటి భుజాల మధ్య
దాగిన చిన్ని శిరస్సునయ్యిందీ నేనే

సీతాకోకచిలుకనై తేలినా, గుండె లోపలికి దిగిన
గాయాలకు మందుగా తేనెపూతలు పూసినా
బాల్యం మునగబెండ్లను నడుముకు కట్టి
నిర్భయంగా బావి పైగట్టు మీంచి దూకినా
తేనెల తీపితలపుల బూడిద వొళ్లంతా రాసుకుని
కుట్ట వచ్చిన తేనెటీగలను మాయపుచ్చి పంపినా
ఊహలే కదా, ఇవేమీ శాశ్వతం కాదనే చావు
తెలివితో
పన్నీటి మోహంలో పడి మునిగిపోకుండా బైట
పడినా

అవేం పెద్ద విశేషాలు? మన్వంతరాల మానవ
సాహసాలే,
నా ఈత బాగా కొత్తగా ఉండాలనుకుని, ఈసారికి
బురదను ఎన్నుకున్నాను, అటు సముద్రమూ
కాదు
ఇటు మట్టీ కాదు, ఆ రెండూ కలిసిన బురద
నీటికి తీరం మట్టి, మట్టికి తీరం నీరు
ఇప్పుడు నేనుతీరం లేనిబురదలో ఈదుతున్నాను
ఈదుతూనేఉన్నాను
తీరం కనిపించకున్నా ఈ ఈత ఆపలేను.
ఆపితే మునిగిపోతాను
నా చేతుల తాకిడికో,పొరుగు మనిషి ఊపిరికో
గాలిలో ఎగిరి పడే బురద
కాసేపు గట్టిపడి పగుళ్లువారుతూ
తేమను పీల్చి లోపలికి కరుగుతూ
బుడగలు బుడగలుగా
భయంకరమూఅభయంకరమూ అయిన
రూపాలు ధరిస్తూ బురద ...

- హెచ్చార్కె, +16096472863

# నది కోసం...

బాధ లేని హృదయం
వుంటుందా
మాటలు తాకని
మనసు వుంటుందా
మనుషులు మనుషులుగా
హత్తుకోక గుండె నరం
తెగి దూరం అవుతున్నాం
ఏదో ఒక మాయ కమ్ముకుని
మనకు మనమే కంచెలకు
ఆవల నీవు ఈవల నేను
గుచ్చుకున్న ముళ్లను ఏరుకుంటూ
నెత్తురంటిన ముళ్లన్నీ
కన్నీటితో ఎదురుగా

కానీ కరగని
నీవు నేను రాతి బొమ్మలులా
మిగిలాం



ఒకసారి ఏదైనా నది
యిలా ప్రవహిస్తే బాగుండు
మనుషులతో పాటు
మనసును కడిగి
గల గలా పారేది
నది కోసం నేనిప్పుడు
ప్రార్థిస్తున్నా...

- కెక్యూబ్ వర్మ, 9493436277

# పీచర సునీతా రావు 2025 సాహిత్య పురస్కారాలకు ఆహ్వానం

స్వర్గీయ పీచర సునీతారావు పేరుతో ఈ సంవత్సరం యథాక్రమంగా ఐదవ వార్షిక పురస్కారాలు ప్రదానం చేయడంకోసం పీచర సునీతా రావు ఫౌండేషన్ ,కవిత్వం, కథలు ,విమర్శ అనే మూడు సాహితీ విభాగాలకు సంపుటులను అహ్వానిస్తున్నది. మార్చ్2022 నుండి డిసెంబర్ 2025 వరకు వెలువడిన రచనలే పంపించాలి. ఇంతకంటే ముందుగాని తరువాత గానీ వచ్చిన రచనలు పరిశీలించబడవు. కవిత్వం,కథ,విమర్శలో ఎన్నికైన ప్రతి సంపుటానికి మే 10,2026 న రవీంద్రభారతిలో పీచర సునీత సంస్మరణ తో జరిగే సభలో 15000 రు. నగదు మరియు సాహితీ ప్రముఖులతో సత్కారం ఉంటుంది.

రచయితలు ప్రతి విభాగంలో మూడు కాపీలు పంపించాలి.

రచనలు మాకు చేరవలసిన చివరి తేది ఫిబ్రవరి 25 , 2026 .

**రచనలు పంపించాల్సిన చిరునామా:**
**పీచర సునీతా రావు ఫౌండేషన్ కేర్ ఆఫ్\ విజయేందర్ రావు**
**ప్లాట్ .నం . 505,బ్లాక్ డి .భీమాప్రైడ్ అపార్ట్ మెంట్స్ ,**
**నియర్ సుచిత్ర సర్కిల్ ,జీడిమెట్ల ,హైదరాబాద్ -67.9866043441, 9848698699**

**- విజయేందర్ రావు, పీచర సునీతా రావు ఫౌండేషన్ చైర్ మెన్.**
కాంచనపల్లి గోవర్ధన్ రాజు. 96760 96614.అవార్డ్ కమిటీ కన్వీనర్

# రచనలకు ఆహ్వానం

**సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..**

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
**mahaapatrika@gmail.com**
**whatsapp 9247580946**

# పుస్తక సమీక్షల కోసం...

**తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.**
**43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034.**

# చరిత్ర ఉక్కు కౌగిలిలో జీవితం

రష్యా, యుక్రెయిన్ల మధ్య దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న సమరంలో లక్షలాది సైనికులు, ప్రజలు రెండు వైపులా ప్రాణాలు కోల్పోతున్నారు. 1991 వరకు సోవియెట్ యూనియన్లో అంతర్భాగంగా యుక్రెయిన్ ఉంది. స్టాలిన్ యొక్క సమష్టి వ్యవసాయం దశలో బలవంత ధాన్య సేకరణ వల్ల లక్షలాది యుక్రెయిన్ ప్రజలు ఆకలి చావులకు గురయ్యారని వాదన ఉంది .మరో వైపు కులక్కుల విప్లవ వ్యతిరేక కుట్ర ను , రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో యుక్రెయిన్ ప్రజలలో పెరిగిన నాజీ అనుకూల ధోరణినీ ఏ ప్రభుత్వం సహించలేదని వాదించారు. కోట్లాది సోవియెట్ ప్రజలు ఫాసిస్టు వ్యతిరేక దేశభక్తియుత యుద్ధంలో అసువులు కోల్పోవటం కాదనలేని సత్యం. యుద్ధం తర్వాత పెరిగిన యూదు వ్యతిరేకతను సోవియట్ రచయితలు గుర్తించారు .బ్యూరోక్రాట్ నిరంకుశత్వం మేధావుల అణచివేతకు దారితీసింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో పాస్టర్నాక్ ,సోల్జెనిట్సిన్ లాంటి సోవియట్ వ్యతిరేక రచయితలకు నోబెల్ బహుమతి లభించింది.

ప్రచ్ఛన్న యుద్ధం తర్వాత అమెరికా కూటమి లిబియా, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్లపై చేసిన దురాక్రమణ , ఇటీవలి యుక్రెయిన్ రష్యా యుద్ధం, ఇజ్రాయెల్ కు దన్నుగా నిలిచి చేసిన పాలస్తీనీయుల ఊచకోత అందరికీ తెలిసిందే.

వసీలీ గ్రోస్మాన్ (190564) నాటి రష్యన్ సామ్రాజ్యంలో యుక్రెయిన్ ప్రాంతంలో బెర్డిచేవ్ గ్రామంలో ఒక యూదు కుటుంబంలో జన్మించారు. మాస్కోలోని స్టేట్ యూనివర్సిటీలో కెమికల్ ఇంజినీరింగ్ చదివారు. తర్వాత రచనా రంగానికి మారి ఖ్యాతిని పొందారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో రెడ్ స్టార్ పత్రికకు యుద్ధ విలేకరిగా పనిచేశారు. ఆయన యుద్ధానంతర కాలంలో రాసిన ప్రఖ్యాత నవలలు Life and Fate('జీవితం మరియు విధి), Everything Flows ('ప్రతిదీ ప్రవహిస్తుంది' ). గ్రోస్మాన్ తన నవలల ద్వారా మానవ చరిత్ర తత్వాన్ని, వ్యక్తులకు రాజ్య వ్యవస్థ మధ్య సంఘర్షణను చిత్రించారు. కృశ్చేవ్ వచ్చిన తరువాత కూడా నాటి నిరంకుశ అధికారుల మూలానా ప్రచురణ కు నోచుకోలేదు. మొదట 1985 లో పాశ్చాత్య దేశాల్లో వెలుగు చూసి 1988 తర్వాత మాత్రమే రష్యాలో ముద్రితమయ్యాయి. తన పుస్తకానికి స్వేచ్ఛ కోరుకున్న గ్రోస్మాన్ 1964 లో కేన్సర్ వల్ల చనిపోయారు.

వసీలీ గ్రోస్మాన్ రచించిన నవల 'జీవితం మరియు విధి' రెండవ ప్రపంచ యుద్ధంలో సోవియట్ ప్రజలు జర్మన్లకు వ్యతిరేకంగా పోరాడి సాధించిన విజయానికి దర్పణం పడుతుంది. ఈ నవల టాల్స్టాయ్ "యుద్ధం మరియు శాంతి" , షోలకోవ్ నవల "ప్రశాంతంగా ప్రవహిస్తున్న డాన్' లాంటి రచనల తరహాలో ఐతిహాసిక రచన. ఈ నవల విశాలమైన కాన్వాస్ పై రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో వ్యక్తులు, కుటుంబాలు, సమాజాలు, ప్రాంతాలు, జాతులు , దేశాల విధి ఏ విధంగా పెనవేసుకుపోయింది , మానవత, నాగరికతలు ఎలా మూల్యం చెల్లించాయో చిత్రించింది. జర్మన్ దురాక్రమణ వాంఛ , బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల 'సంతృప్తి పరిచే విధానం', తప్పని సరి పరిస్థితిలో జర్మనీతో రష్యా చేసుకున్న ఒప్పందం , తరువాత జరిగిన మహా మారణ హోమం, జాతుల పరాధీనత, నిర్బంధ శిబిరాల్లో జనహననం చరిత్రకెక్కాయి. అలాగే సోవియట్ యూనియన్ లో కొత్త తరం అధికారుల అతి చర్యల వల్ల పాత తరం విప్లవకారులు, రచయితలు, శాస్త్రవేత్తల ఉత్థాన పతనాలు చోటుచేసుకున్నాయి.

వసీలీ గ్రోస్మాన్ నవలలో షాపోష్నికోవ్ సోదరీమణులు ఆయన ల్యుడ్మిల్ల మరియు ఎవ్గేనియాల జీవితాల్లోని విధివిలాసం కనిపిస్తుంది. ల్యుడ్మిల్ల భర్త విక్టర్ ష్ట్రూమ్ ఒక అణుశాస్త్రవేత్త. పై అధికారుల పక్షపాత ధోరణి, చలవ మూలానా తన కెరీర్ లో కీర్తి, అపకీ




ర్తులు రెండూ మూటగట్టుకున్నాడు. లుడ్మిల్ల తన కుమారుడు తోల్యాను యుద్ధంలో పోగొట్టుకుంది. అయినా భర్త కష్ట నష్టాల్లో అండగా ఉంటుంది. ఈ అక్క చెల్లెళ్లలో మరింత సాహసమున్న యెవ్గేనియ తన నివాస పత్రం కోసం అధికారులతో పోరాడుతుంది.ఆమె తన మొదటి భర్త ఎర్ర సైన్యంలో కొమిసార్ గా ఉన్న క్రిమోవ్ ఒకే దారి మనస్తత్వం నచ్చక అతనికి దూరమై కల్నల్ నోవికోవ్ కు దగ్గర అవుతుంది.

విక్టర్ సహచరుల్లో అన్ని రకాల వాళ్ళు , సోకోలోవ్, అన్నా లోశ్కోవా లాంటి మిత్రులు, షిషాకోవ్ లాంటి శత్రువులు, అవకాశవాదులు, చెపిజిన్ లాంటి నిరసనకారులు ఉంటారు. మాస్కోకి దూరంగా ఉన్న తరుణంలో విక్టర్ , అతని మిత్రుల స్వేచ్ఛాయుత సంభాషణను వారిలో ఎవరో అధికారులకు చేరవేయడం వల్ల విక్టర్ తన స్థానం కోల్పోతాడు . ఆ పరిస్థితిలో అతడి స్నేహితుడి భార్య మార్య ఇవనోవా సోకోలోవా విక్టర్ పట్ల సానుభూతి చూపిస్తుంది. ఆ క్రమంలో ఇద్దరూ దగ్గరైనా వారి బంధం వివాహ బంధం బయట ఉండటంతో విక్టర్ అపరాధ భావనకు లోనవుతాడు. విక్టర్ భార్య ల్యుడ్మిల్ల తన సొంత బాధలో ఉన్నప్పటికీ భర్త అంతర్గత సంఘర్షణను అర్థం చేసుకుంటుంది. ఆమె సోదరి అయిన యెవ్గేనియ మొదటి భర్త క్రిమోవ్ ద్రోహం ఆరోపణపై జైలుకు వెళ్లి, ఇంటరాగేషన్, చిత్రహింసలకు గురవుతాడు. అతడ్ని చూడటానికి యెవ్గేనియ వెళ్ళటం, ఉత్తరం రాయటం కల్నల్ నోవికోవ్ కు నచ్చదు.

విక్టర్ పాత్ర తన తల్లి మృతి తర్వాత అపరాధ భావనకు గురవడం, స్టాలిన్ వ్యతిరేక డాక్టర్లు కుట్ర కేసులో లేఖపై వారికి వ్యతిరేకంగా సంతకం చేయడం, స్నేహితుడి భార్య పట్ల ప్రేమ విషయాల్లో రచయిత వ్యక్తిగత జీవితానికి కూడా సామ్యముంది.

ఈ నవలలో జర్మన్, రష్యన్ నిర్బంధ శిబిరాల్లో బానిసత్వ జీవిత చిత్రణ విపులంగా ఉంది. విభిన్న వృత్తుల,జాతుల, మతాల ప్రజల మానవత, ఆత్మ గౌరవం భగ్నమై, వారి సమాధులు వారే తవ్వుకునే దయనీయ స్థితికి లోనై, వారిలో కొందరు తెగించే చేసే తిరుగుబాట్లు నిర్దయగా అణచివేతకు గురయిన ఘటనల వర్ణన ఉంది. నేతల ఉన్మాదం ,జాతీయ దురహంకార ఫలంగా సామాన్యులు బలి అయిన విషాద ఘట్టం. అట్టి వారిలో పాత బోల్షెవిక్ మోసోవ్స్కోయ్, మాజీ టాల్స్టాయ్ అనుయాయి ఇకిన్నికోవ్ మెర్జ్, పాత మెంషివిక్కు చెర్నిసోవ్, జర్మన్ల చేత చిక్కిన రష్యన్ ఆఫీసర్లు ఉంటారు. ఇక రష్యన్ నిర్బంధ శిబిరాల్లో అబర్చుక్ ( నవల్లో ల్యుడ్మిల్ల మొదటి భర్త), రూబ(మెడికల్ ఆర్డర్లీ), బర్కతోవ్ అనే నేరస్తుడు, మగర్ (పాత బోల్షెవిక్ మరియు అబర్చుక్ టీచర్), మార్మికవాది ప్రిన్స్ డాల్గోర్కి, మాజీ ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్ స్టెపనోవ్ మొదలగువారు ఉంటారు. క్రూర రాజ్యం చేత చిక్కి దీర్ఘకాలిక శిక్షలు, బలవంత నేరాంగీకారాలతో సాలెగూడులో చిక్కిన కీటకాలను పోలిన మానవులు.

నాజీల నిర్బంధ శిబిరాల్లో మానవత మట్టి కలిసే అత్యంత దయనీయ దృశ్యాలు గోచరిస్తాయి.పునరావాసం కల్పిస్తామని నమ్మించి లక్షలాది మందినీ వధ్యశాలలకు తీసుకెళతారు నాజీలు. బాధితుల వ్యక్తిగత వస్తువులు, ఆభరణాలు , విలువైన వాటిని అన్నింటినీ చివరకు వారి జుత్తును కూడా తీసుకుని వారి ఆత్మ గౌరవాన్ని చంపి గ్యాస్ ఛాంబర్లలోకి పంపి గత చరిత్రను రక్తం, కన్నీటితో తడిపారు నాజీ ముష్కరులు. రచయిత ఆ దృశ్యాలు వర్ణించిన తీరు పాఠకుల మదిని స్తంభింప చేసి , హృదిని నలిపివేస్తుంది. నాజీల మస్తిష్క వల్మీకంలో దాగిన ఆ సుప్త భుజంగాల ద్వేష విషపూరిత చర్యలను గ్రోస్మాన్ మనకు కళ్ళకు కట్టినట్లు చూపిస్తాడు.

దీనితో పాటు రష్యన్ యుద్ధ విమాన పైలట్ల, ఒక యుద్ధరంగంలో 6/1 ఇంట్లో చిక్కుకున్న సైనికుల, స్టాలిన్ గ్రాడ్ యుద్ధంలో రష్యన్ ప్రజల, సైనికుల, అధికారుల సాహస కృత్యాలను కూడా రచయిత వర్ణిస్తాడు. యుద్ధం మధ్యలో ఆహారం , నీరు కోసం ఘోరమైన వెతుకులాట, బంకర్లలో జీవితం, అంతటి సమరంలో పాల్గొనే యువజనుల మధ్య చిగురించే ప్రేమ , వారి త్యాగశీలత, హాస్య సన్నివేశాలు, శత్రు యుద్ధ ఖైదీ వైపు ఇటుక ముక్క కాకుండా రొట్టె ముక్క విసిరే ముసలి అవ్వ జాలి హృదయం, దేశంలో కొన్ని ప్రాంతాలు నాజీలతో చేతులు కలపడం, గత చెడు అనుభవాలతో కొందరి ద్రోహం ఇవన్నీ మన మెదళ్లలో సంకిష్ట ఆలోచనావేశాల మిశ్రమాన్ని కల్పిస్తాయి.

ఇంతే కాక ఈ నవలలో జర్నలిస్టు మరియు రచయిత అయిన గ్రోస్మాన్ కవి హృదయంతో చేసిన అద్భుత యుద్ధ, ప్రకృతి వర్ణనలున్నాయి. బైరోజ్కిన్ కాలికింద మెషిన్ గన్ పేలి " నెల నుంచి అకస్మాత్తుగా పిచ్చుకల దండు దూసుకొచ్చినట్లుంది"

విమానం నడుపుతున్న లెఫ్టినెంట్ విక్టరోవ్ చూసిన దృశ్యాలు కదిలిస్తాయి.

"ప్రాచీన శిలలు ఈ సరస్సుల, వనాల మధ్య పరువులెట్టాయి; పొడవైన, నిటారు చెట్ల నుంచి చర్చిలు నిర్మితమయ్యాయి; వాటి నుంచి పడవల తెరచాపలు తయారయ్యాయి. ఈ వనాల మధ్య నుంచి బూడిద రంగు తోడేలు పరిగెత్తింది...నశించిన గతం సాదాగా, యవ్వనవంతంగా , అమాయకంగా గోచరించింది. అంతస్తుల్లోని కన్యలే కాకుండా బూడిద రంగు గడ్డాల వర్తకులు, మత పరిచారకులు, పెద్దలు అందరూ మర తుపాకులు, డీసెల్ ఇంజన్లు, సినిమాల వేగవంత ప్రపంచం నుంచి వచ్చిన లౌక్యం గల యువ పైలట్ల కన్నా యవ్వనంతో కనిపించారు. వేగంగా, సన్నగా ,ఎత్తయిన బహుళ రంగుల కరకట్ల మధ్య , హరిత అరణ్యాల మధ్య,తేలికపాటి నీలి,ఎరుపు రంగుల అల్లిక నడుమ పారుతున్న వోల్గా ఈ నశించిన గతానికి ప్రతీకగా ఉంది."

గ్రోస్మాన్ తత్వం మానవ జీవితం పట్ల అతని లోతైన అవగాహన తెలుపుతుంది. ఫాసిజం వల్ల ప్రజలు పర ద్వేష భావనకు గురై ఏకగ్రీవంగా ఓటేసి, హత్యాకాండ పట్ల మౌనం వహించి , జైళ్లలో కుక్కబడి అమిత విధేయంగా మారారు. కొందరు మాత్రం తిరగబడ్డారు. జన్మ భూమి పేరుతో, సంకుచిత అస్తిత్వాల పేరుతో ఆత్మరక్షణ సహజాతం సమర్థన కు గురయింది. నిరంకుశ రాజ్య హింస ఆరాధనా వస్తువయింది. అంధ ఆశావాదం, ప్రాణాలకు తెగించి చేసిన తిరుగుబాట్లు, మరణ శిక్షలకు నిరీక్షణ, తలారుల పలుకులపై అమాయకుల నమ్మకం చోటు చేసుకున్నాయి. రచయిత వార్సా మురికి వాడల్లో తిరుగుబాట్లు, ట్రిబ్లింకా ఇతర శిబిరాల్లో , అణచివేతకు గురయిన దేశాల్లో ఉద్యమాలు, స్వేచ్ఛకోసం విద్యార్థుల తిరుగుబాట్లు కూడా ఈ నవలలో ప్రస్తావిస్తారు.

సోవియట్ చరిత్రలో ఉక్రెయిన్ బాధలని, మేధావుల మౌనం, వీరుల సాహసం, యూదు వ్యతిరేకత పెరగటం, స్వేచ్ఛ, స్టాలిన్ గ్రాడ్ యుద్ధంలో దేశభక్తి వెల్లువలను రచయిత గొప్పగా చిత్రించారు. ఈ నవల దాని ఆంగ్ల అనువాదకుడు రాబర్ట్ చాండ్లర్ చెప్పినట్లు "మానవ స్వభావం గురించిన ఛేకొవియన్ ఇతిహాసం."

- డా.జె. రవీంద్రనాథ్,
8978131585

## మానవత్వపు దారిని పరిచయం చేసిన కవిత్వం

# మళ్లీ మనిషిలోకి..

కవిత్వమంటే ఏమిటి అనే ప్రశ్నకి చిక్కే సమాధానాలెక్కువే,ఎవరిపరిధి మేర వారు స్వేచ్ఛగా అల్లుకునే అక్షరాలలో కవిత్వానికి నిర్వచనాలు ఎక్కువే,పరివర్తన లో మార్పులు సహజమే కదా మనం ఏదైనా అంగీకరించాల్సిందే.భావప్రకటన స్వేచ్ఛ మనది అయినపుడు ప్రతి వ్యక్తి భావాలను గౌరవించడం ప్రథమం.

కాలక్రమేణా కొత్త ప్రశ్నలెన్నో పుట్టిన అంది,అందని జవాబులు అందుకున్న ఒక ప్రశ్నకి ఖచ్చితమైన జవాబు మాత్రం కొందరి వద్దే దొరుకుతుంది.. ఇంతకి ఆ ప్రశ్న చెప్పలేదు కదా!! ఆప్రశ్నేమిటోకాదు అసలు నిజమైన కవిత్వమంటే ఏమిటి ఇది అందరి మదిలో మెదిలేదే బయటపడమంతే ఏమంటారు??? అయితే ప్రశ్నలో జవాబు దొరికిందనుకోవాలి ఎందుకంటే కొన్ని పుస్తకాలను చదివినపుడు ఆ భావన మనలో పుడుతుంది. ఇది కదా నిజమైన కవిత్వం అని అంతరంగం మది తలుపులు తెరిపిస్తుంది.నిజమైన కవిత్వానికి హద్దులు ఉండవు,తారతమ్యాలు తెలియవు. తెలిసిందల్లా ఒకటే సమస్యని ఎత్తి చూపి బాధితుడికి అండగానిలవడం లోకంని మనసుతో చూడడం..ఆ కోవకి చెందినదే ఈ పుస్తకం" మళ్లీ మనిషిలోకి 'అంటు మన మనసులో ముసుగుని తుడిచేసి మనిషిని గౌరవించాలని తెలుపుతు మన ముందుకువచ్చింది. ఎన్నో భావాలని రంగరించుకుని మట్టి గంధాన్ని దిద్దుకోని మట్టిపూలభాషకి జీవంపోసి మట్టి మనుషుల శ్రమనంతా అక్షరాలకి జతచేసి ఆలోచింపజేసింది... నువ్వు మనిషివి అని మనని మనకే కొత్తగా పరిచయం చేసింది..అయితే కవి గురించి ఒకే మాటలో చెప్పాలంటే ఇతను కవిత్వం రాయడం లేదు, కవిత్వంతో జీవిస్తున్నాడు అందుకే అందరిమదితలుపులని తెరిచే భావాల్ని రంగరించి చిక్కనైన కవిత్వాన్ని అందిస్తున్నాడు.

పుస్తకంలో అన్ని కవితలు దేనికదే ప్రత్యేకం కాని కొన్ని కవితలు చదివినప్పుడల్లా కొత్త ఉత్తేజాన్ని నింపుతాయి.. అలాంటి కవితలలో ఒకటి నేను గ్రామపోషకున్ని, నాగలికినడకనేర్పి మెతుకుని అందిచ్చేవాన్ని, నీ అందం ఆరోగ్యం కోసం బట్టల్ని దూదిపూలు చేసే మడేలును, క్షవరంచేసి నిన్ను మనిషి చిత్రంగా మలిచే నాయిబ్రాహ్మణున్ని నేను,
పుట్టుక నుంచి చావు దాకా అంగాంగందిద్దిన విశ్వబ్రాహ్మణున్నని,
నీ శవ యాత్రకు ముందుండి నడిచే కుమ్మరి కుండని నేను.. అనే కాలుగా నేను అనే కవిత).. శ్రమసౌందర్యమంతా చదివించిన కవిత పనిని గౌరవించి,జీవిత ప్రయాణంలో అందరిసహకారమందితేనే బతుకుబండి సాగిపోతుంది అని తేటతెల్లంచేసిండు.
ఇవన్ని మన కనుల ముందే జరిగిన మనం గుర్తించం అన్నింటికి ఓ గుర్తింపు ఓ గౌరవం ఇచ్చినపుడే నీవు మనిషివి అని తన కవిత పాదాలలో ఒదిగించాడు కవి.. ఇపుడు మీకర్థమయిందనుకుంటా నేనెందుకు నిజమైన కవిత్వం ప్రస్తావన తెచ్చానో అని!!

మనమెంతా ఎదిగిన మన ఉనికి మన కుటుంబం, బంధాల నీడలో గడిపిన మన బాల్యమంతా మనని అప్పుడప్పుడు పలకరిస్తది. కాలం కదిలిపోయిన కొద్ది జీవితం ఎన్నో అనుభవాల్నిస్తుంది.అప్పుడప్పుడు గతం లోతులోకి వెళ్లడం కూడా మంచిదే కదా మళ్లీ కొత్తగా మనని మనం నిర్మించుకునేందుకు..ఆ కోవలోకే చెందినది ఈ కవిత.
తండ్రి కష్టం చూసి పెరిగిన కొడుకు ప్రయోజకుడవుతాడు అనడం నమ్మదగిన సత్యం.. ఈ కవి తన తండ్రి మీద మమతని తండ్రి చేసిన శ్రమని ఎంత అందంగా అల్లాడో !! అక్షరాలని చూసి గుండెలోధుఃఖపుదార పొంగుకొచ్చింది..
బతుకంతా బొగ్గు లోనే బూడిదై,
కమిలిపోయి మాడిపోయి,
అసలు రూపం మసకబారేది.
మాకోసం నువ్వు వెన్ను పూసల్ని అరగించుకొని,
వెన్నుపూసల భవిష్యత్తు అందించావు.
నాన్నా ! మా జీవిత నాటకానికి
కనిపించని గొప్ప దర్శకుడివి,
కనిపించే రియల్ హీరోవి నువ్వే. (పెద్ద దర్వాజా) కవిత పేరు
తండ్రి పడ్డ శ్రమని గుర్తించిన కొడుకు మనసుతో రాసుకున్న అక్షరాలకి ఎంత బలముంటుంది..అందరిని భావోద్వేగపునీడలో నిలబెట్టెసత్తా వుంటుంది. మనసుని చదివే కవిత్వమంటే ఇదేనేమో మరీ.
రాయడం ఒక ఎత్తు,సన్నివేశాన్ని కనులకద్దినట్లు కవిత పంక్తులలో భావాలని వ్యక్తపరచడం మరో ఎత్తు.. ఈయన రాయడం లోనే దిట్ట అనుకుంటే
పొరపాటు..దృశ్యమంతామనముందుంచిమనల్ని కవితలోకి దూరిస్తాడు అందుకే ఇతను మట్టి కవి, మనిషి కవి, మనసుకవి..
కరోనా అందరికి గుణపాఠం నేర్పింది. స్వచ్ఛమైన గాలి కున్న శక్తి ఎంతనో మనకి
అపుడర్థమయింది.అరనిమిషం ఊపిరి కోసం భాదితులు పోరాడిన క్షణాలు జీవితానికి సరిపడా నీతిని బోధించాయి. ఆ స్థితిగతులలో మానవత్వమున్నా మనుషులు మేముసైతం అని తమ సేవల్ని అందించారు.
అంటి ముట్టని దూరాలని చెరిపి ధైర్య గీతాలను దిద్దారు. ఆ పరిస్థితులమీద కవి స్పందించాడు. ఎక్కడినుంచో దిగివచ్చిన నెలవంకలు,
ఆనెలవంకల కండ్లనిండ దయాపాతాలు, ఆ నెలవంకల దోసిళ్ల నిండా,
కరుణామృతధారలు.
భయాన్ని పైజామా బొందెకు కట్టేసి,

అసహ్యాన్నికాలిబొటనవేలితో విరిచేసి
పాడెమోసి,కొంగువిసిరి,
చివరికి చితిమంటను పేర్చి మనుషులయ్యారు.
కుల,మతాలకి అతీతంగా ముస్లిం సోదరులు కరోనాతో మృతిచెందిన వారి పాడెమోసి వారి మనసులో మానవీయకోణపు ఔన్నత్యంచాటుకున్నారు.
మానవత్వం ఇంకా బతికే వుంది అని నిరూపించిన కవిత..కవి విశాలదృక్పద లోతు కనబడుతుందికదా..
ఆయనకి కవిత్వం కొత్తకాదు మూడుపదులు దాటక ముందే పరిచయమైన నేస్తం అప్పుడు,ఇప్పుడు ఒకే ఉత్సాహం ప్రతి సంపుటికి మరో కొత్తదనం స్పష్టమైతది. రాయాలనే తపన అతని నర,నరాన ఆవహించింది. ఏ పని మొదలుపెట్టిన నీకు కావాల్సింది విశ్వాసం అప్పుడప్పుడు గమ్యం చేరుకుంటామా లేదా అనే తటాపటాయింపు సహజమే అలాంటి ఆలోచనని కూడా ధరికి రానివ్వకని విశ్వాస పాఠం చెవిలోఊదుతాడుకవి ఈ కవితలో.. నడిచే వాడి సంకల్పం గట్టిదైనపుడు,
గుండ్లయిన,ముండ్లయిన దారివ్వక తప్పదు,
దారిని కమ్మేసింది నిరాశ చీకట్లను, ఉక్కు పిడికిలితో ముక్కలు చేయాలి. ( సంకల్పం అనే కవిత).
విశ్వాసం నూరిపోసి గమ్యంవైపు అడుగులేయించడం మాటలకన్నా అక్షరాలకే సాధ్యమవుతుంది. ఇలా ఎన్నో విశ్వాస పాఠాలు,పలకరింపులు, ఆవేదనలు, చెరగని గుర్తులు, జ్ఞాపకాలనీడలో దాగిన సత్యాలు, పల్లె అందాలు, ఆప్యాయతలు ఎన్నో ఈ పుస్తకంలో ఒదిగాయి.
చదువుతుంటే మనం మళ్లీ మనిషిలోకి వెళతాం.
ఈ కవి అనుభవం,సాహిత్యం ముందు నేనోక పిల్లమొగ్గని అయిన ఉడతాభక్తిగా కళం కదిపాను ఈసమీక్ష కి జీవం పోసాను.
వచన సాహిత్యంలో వీరు తనదైన ముద్రతో కవిత్వప్రయాణం చేస్తున్నారు. అక్షరసేధ్యంచేస్తున్న నిత్యకృషివలుడు మార్పుకోసం తపిస్తాడు, కొన్నింటికి చలించి ప్రశ్నగా వెలుగు తాడు..
ఎందరికో సాహిత్యదారిగా మారుతాడు. అక్షరంకోసం ఎంత దూరమైనా వెళతాడు. అందుకే ఇతను ఆదిలాబాద్ సాహిత్యనిషాని..తప్పిపోయిన మానవత్వాన్ని గాడిలో పెట్టాలనే తపనంతా తన అక్షరాలలో ఒదిగింది. సమాజ శ్రేయస్సుకై కదిపే తన కళం
మరెన్నోకొత్త సంపుటిలతో మన ముందుకువచ్చి జ్ఞాన జ్యోతిని ప్రతిమదిలో వికసింపజేయాలని,నవసమాజ స్థాపనకై మరింత వేగంతో ముందుకెళ్లాలని కాంక్షిస్తు నమస్సులు..

- కొండా సాయిప్రియ



# బహువచనం

నీవు కత్తిని నమ్మావు
వాడు శాంతిని నమ్మాడు
నీవు తూటాను నమ్మావు
వాడు ఓటును నమ్మాడు
నీవు పోరుతో రాజ్యమన్నావు
వాడు ఓటుగెలుపుతో గద్దె
అన్నాడు
నీ దారి అడవి ముళ్లదారి
వాడిదారి నల్లేరుపై నడక...
పంచసప్తతి దాటిన
అడవులు
తగలబడుతున్నాయి
ఆకలి పులికి బలి అవుతునే
ఉన్నారు
నేలపై నెత్తుటి మరకలు
పరుచు కున్నా
ఆశల పంటలు పరులపాలు
అవుతున్నా
నిశబ్ధం మౌనం అచేతనం
మూడు కోతులు
కదలక వదలక ఉడుములా
పట్టుకున్నాయి...

వాడు నీవు కలిస్తే
ఎండుతున్న పైరుపై వర్షం
కురిసి నట్లే
పచ్చదనం లో స్వేచ్ఛకేకి
పురివిప్పినట్లే

- రేడియమ్
9291527757

# సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి పండుగ నిలుస్తుంది

## మాజీ రాష్ట్రపతి వెంకయ్య నాయుడు... స్వర్ణ భారతి ట్రస్ట్ ఆడిటోరియంలో సంక్రాంతి సంబరాలు...

**రాజేంద్రనగర్ మహా ;** సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి పండుగ నిలుస్తుంది. తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎంతో సంతోషంగా సంక్రాంతిని జరుపుకుంటారని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. శంషాబాద్ మండల్ పరిధిలోని ముచింతల్ లోని స్వర్ణ భారతి ట్రస్ట్ ఆడిటోరియంలో భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం, వెంకయ్య నాయుడు సంక్రాంతి వేడుకలను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పద్మశ్రీ గరికపాటి నరసింహారావు, సినీ నటుడు డాక్టర్ బ్రహ్మానందం, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బిజెపి అధ్యక్షులు రామ్ చంద్ర రావు, ఎంపీ కొండయ్య విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, సుజనా చౌదరి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం గరికపాటి నరసింహారావు, సినీ నటుడు డాక్టర్ బ్రహ్మానందం, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బిజెపి ఎంపీ కొండయ్య విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, సూజన చౌదరి లను వెంకయ్య నాయుడు శాలువాతో సత్కరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్ణ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని తెలుగు ప్రజలు సంక్రాంతి పండుగను ఉత్సాహంగా జరుపుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వర్ణ భారతి ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

## టిపిసిసి సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్

**ఆమనగల్లు, మహా:** రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని టిపిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. కడ్తాల్ మండలం గడ్డమీది తండాలో ఆదివారం యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ను జడ్పిటిసి దశరథ్ నాయక్, సర్పంచ్ చిట్టి రమేష్, ఉప సర్పంచ్ పంత్య నాయక్ లతో కలిసి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. టాస్ వేసి కొద్దిసేపు బ్యాటింగ్ పట్టి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. రాష్ట్రంలో నూతన పారిశ్రామిక ఒప్పందాలతో స్పోర్ట్స్ ఎకనామిక్ బలోపేతం అవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ గ్రామాన క్రీడా ప్రాంగణంలను ఏర్పాటు చేసి క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ క్రీడాకారులను,గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న లక్షలాది మంది క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సంక్రాంతికి ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసి క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆణిముత్యాలను వెలికి తీయడానికి ఇటువంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. కార్యక్రమంలో సలార్పూర్ తాండ సర్పంచ్ రమేష్ నాయక్, ఉప సర్పంచ్ పంత్య నాయక్,రాందాస్ నాయక్, హిరాసింగ్, తులసి రామ్, వార్డు సభ్యులు దశరథ్ బాబ్లీ, రాందాస్, పాండు, తులసిరామ్, శ్రీను, సురేష్, లచ్చిరాం, రమణ, మల్లేష్,క్రిష్ణ టోర్నమెంట్ నిర్వాహకులు తదితరులు ఉన్నారు



# ప్రజలను ఆపదల నుంచి కాపాడే సేవాదళ్ కార్యకర్తలు

## సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య

**రాజేంద్రనగర్, మహా ;** జనసేవ దళ్ కార్యకర్తలంటే ఆర్మీ లాంటి శిక్షణ గలిగిన వారు అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య అన్నారు. శంషాబాద్ పట్టణంలోని ఎంఎంఆర్ గార్డెన్ లో ఆదివారం జరిగిన జన సేవాదళ్ జిల్లా స్థాయి శిక్షణ శిబిరాన్ని పాలమాకుల జంగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆనాటి ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు ప్రారంభించిన జన సేవాదళ్ నేటికీ కొనసాగుతుంది. దేశంలోని మతోన్మాదం నుండి ప్రజలకు ఇబ్బందులు జరిగినప్పుడు జన సేవాదళ్ కార్యకర్త లు వారి నుండి కాపాడే క్రమశిక్షణ కలిగిన సైన్యం అన్నారు. దేశంలో వరదలు విపత్తులు వచ్చినప్పుడు ప్రజలను కాపాడే ఎర్రసైన్యమే జన సేవాదళ్ కార్యకర్తలు అని ఆయన తెలిపారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే బహిరంగ సభ ప్రదర్శనలో రంగారెడ్డి జిల్లా నుండి జనసేవ కార్యకర్తలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ శిబిరానికి శిక్షణ ఇవ్వడానికి వచ్చిన ముఖ్య అతిథులు పంజాల రమేష్ రాష్ట్ర కన్వీనర్ జనసేన, కో కన్వీనర్ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అనిల్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, రామస్వామి, రామకృష్ణ, ఆర్ యాదగిరి, కన్య, నరసింహారెడ్డి, బాతరాజు, నరసింహ, వడ్ల సత్యనారాయణ, శివకుమార్, ఎంఏ రియాజ్, సిపిఐ మండల కార్యదర్శిలు నర్రగిరి, కే చందర్ యాదవ్, ఎం సత్తిరెడ్డి, కే శ్రీనివాస్, పి సుధీర్, పి శ్రీశైలం,బి నరసింహులు, కాటమరాజు, సక్రు నాయక్, అన్నపు ప్రభు, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

## ఎమ్మెల్యే కాలె యాదయ్య సమక్షంలో కాంగ్రెస్ లోకి మాజీ ఎంపీటీసీ సుమలత జైపాల్ రెడ్డి

**మొయినాబాద్ మహా:** కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన, సంక్షేమ పథకాల అమలు నచ్చి బీఆర్ఎస్ పార్టీ పెద్ద మంగళవారం గ్రామ మాజీ ఎంపీటీసీ పాటి సుమలత జైపాల్ రెడ్డి, పాటి సుధాకర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎల్లుగంటి మధుసూదన్ రెడ్డి, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, మొయినాబాద్ మండల పీఏసీఎస్ చైర్మన్ మందాడి చంద్రారెడ్డి, పెద్ద మంగళారం మాజీ సర్పంచ్ చేగురి రామకృష్ణ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగ మాజీ ఎంపీటీసీ పాటి సుమలత జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాధరణ పొందుతూ సుస్థిర అభివృద్ధికై పాటుపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో బంగారు తెలంగాణ దిశగా అడుగులేస్తున్న చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం అదృష్టంగా భావిస్తున్నాని అన్నారు. కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాబన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి చంద్రారెడ్డి, మందాడి రాఘవరెడ్డి, హిమాయత్ నగర్ మాజీ సర్పంచ్ పల్లగొల్ల మల్లేష్ యాదవ్, సురంగల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం వెంకట్ రెడ్డి, పల్లగొల్ల అశోక్ యాదవ్, మాజీ ఎంపీటీసీ పట్నం రాంరెడ్డి, రేణుట్ల రాజు గౌడ్, బేగరి రాజు, కొత్తపల్లి విక్రంరెడ్డి, కమ్మరి యాదగిరిచారి, ఎం .సురేందర్ రెడ్డి, రామ్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆకలి తీర్చడం గొప్ప సేవ

## ...లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ జి చెన్నకిషన్ రెడ్డి

**ఆమనగల్లు, మహా:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఆమనగల్లు బస్టాండ్ ఆవరణలో బిక్కుమాండ్ల వాసు, బిక్కుమాండ్ల ప్రమోద్,బిక్కుమాండ్ల రవి,బిక్కుమాండ్ల రమేష్ లు ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని జోన్ చైర్మన్ జూలూరు లింగయ్య,క్లబ్ అధ్యక్షులు కే గోవర్ధన్ రెడ్డి తో కలిసి ప్రోగ్రాం చైర్మన్ మాజీ గవర్నర్ జి చెన్న కిషన్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ అన్నదానం మహా పుణ్య కార్యమని ఆకలితో అలమటిస్తున్న వారికి ఆకలి తీర్చడం గొప్ప సేవ అని ఆయన అన్నారు. సమాజంలో లయన్స్ క్లబ్ సభ్యులు కాక ఇతరులు ఎవరైనా జన్మదినాలకు , పెళ్లిరోజులకు, మరి ఏ ఇతర శుభకార్యాలకు గాని,లయన్స్ క్లబ్ ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టవచ్చని ఆయన అన్నారు. సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు. ఈ అన్నదాన శిబిరంలో 350 మందికి అన్నదానం ఏర్పాటు చేసినట్లు క్లబ్బు పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ జూలూరి లింగయ్య, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య, క్లబ్ అధ్యక్షులు కే గోవర్ధన్ రెడ్డి,క్లబ్బు ఉపాధ్యక్షులు ఎంగలి బాలకృష్ణ, కార్యదర్శి గంప శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా చైర్మన్లు కండే ఓంకారం,నటరాజ్ యాదయ్య, ఎం అంజయ్య,జూలూరు రమేష్,ఎం చంద్రశేఖర్,ఉప్పుల రాములు, కండే సత్యం,కొర్వి వెంకటయ్య, రామ్మోహన్,జూలూరి జయప్రకాష్, జూలూరి గోపాల్, జ్యోతి, వాసవి, మణి, బిక్కుమండ్ల నరసింహ, క్లబ్ పిఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.



# నారా భువనేశ్వరి.. ప్రొఫెషనల్ అవార్డు అందుకోవడం హర్షనీయం

## టీడీపీ రాష్ట్ర నాయకులు అండేకార్ యాదిలాల్..

**ఆమనగల్లు, మహా :** నారా భువనేశ్వరికి ప్రతిష్టాత్మకమైన ఔట్ స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు రావడం హర్షనీయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది అండేకార్ యాదిలాల్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు తగ్గట్టు ఆయన అర్ధాంగి భువనేశ్వరి పాడి పరిశ్రమ అభివృద్ధే లక్ష్యంగా హెరిటేజ్ సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయం అన్నారు. ఈనేపథ్యంలో భువనేశ్వరి పాడి పరిశ్రమ అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించిన ఇండియన్ డైరీ అసోసియేషన్ సౌత్ జోన్ ఆమెకు అవుట్ స్టాండింగ్ డైరీ ప్రొఫెషనల్ అవార్డు అందజేయడం హర్షనీయం అన్నారు. హెరిటేజ్ సంస్థ అంటే కేవలం వ్యాపార పరమైన సంస్థ కాదని, పాడిని అభివృద్ధి చేసే విధంగా రైతులకు దిశా నిర్దేశం చేసే ఒక సామాజిక సేవా సంస్థ అని ఆయన వెల్లడించారు. గతంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా వాటి కొనుగోలు కోసం రైతులకు రూ.78 లక్షలు చెల్లించారని ఆయన గుర్తు చేశారు.



# సిబిఐటి కళాశాలలో భవిష్యత్తుతరం సాంకేతికతపై రెండు రోజుల జాతీయ స్థాయి కార్యశాల

**గండిపేట,మహా:** గండిపేట మండలం లోని చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో ఐఈటిఈ స్టూడెంట్ ఫోరం ఆధ్వర్యంలో భవిష్యత్ తరం విఎల్ఎస్ఐ సాంకేతికతలు అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి కార్యక్రమాలను జనవరి 9 మరియు 10వ తేదీలలో విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ కె. వసంత్ మరియు ఐఈటిఈ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ బి. నీరజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలలో విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. పాస్ ట్రాన్సిస్టర్ లాజిక్ రూపకల్పన, విఎల్ఎస్ఐ సర్క్యూట్ల సిమ్యులేషన్ మరియు స్పైస్ టూల్ ద్వారా నెట్లిస్ట్ ప్రోగ్రామింగ్ వంటి అంశాలపై ప్రాయోగిక అవగాహన కల్పించింది. హ్యాండ్స్ ఆన్ లెర్నింగ్‌కు ప్రాధాన్యత నిస్తూ విద్యార్థులు కాడెన్స్ టూల్స్ ఉపయోగించి సర్క్యూట్ డిజైనింగ్‌లో శిక్షణ పొందారు. ఇది విద్యార్థులలో ఆధునిక విఎల్ఎస్ఐ ఆర్కిటెక్చర్లపై సాంకేతిక పట్టును పెంపొందించిందన్నారు. హైదరాబాద్‌లోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులతో పాటు, సిబిఐటి ఈసిఈ మరియు ఈఈఈ విభాగాలకు చెందిన 2026, 2027 బ్యాచ్ విద్యార్థులు ఈ కార్యశాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు.సిద్ధాంత జ్ఞానాన్ని వాస్తవ ప్రపంచ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా మార్చడంలో ఈ వర్క్‌షాప్ కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. వి. నరసింహులు మరియు ఇతర ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లకు ఐఈటిఈ స్టూడెంట్ ఫోరం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమం ద్వారా ఇంజినీరింగ్ విద్యార్థులను పరిశ్రమకు సిద్ధం చేయడంలో సిబిఐటి కళాశాల తన నిబద్ధతను చాటుకుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# చేవెళ్ల కేంద్రంగా డీసీపీ కార్యాలయం

- తాత్కాలికంగా మొయినాబాద్ లో ఏర్పాటు
- పోలీసింగ్ వ్యవస్థలో సమూల మార్పులు

**మొయినాబాద్ మహా:** ఒకప్పుడు రాజధాని హైదరాబాద్ విసిరేసినట్టుగా ఉండే చేవెళ్ల ప్రాంతంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా పోలీసింగులో ఈ మార్పు కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. సైబరాబాద్ ప్రాంతం ఏర్పడిన అనంతరం.. చేవెళ్ల అందులో చేరింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భవిష్యనగరాన్ని తీర్చిదిద్దడంపై దృష్టి సారించింది. కొత్తగా ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనరేట్ ను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగానే చేవెళ్ల కేంద్రంగా జోన్ కార్యాలయానికి బీజం పడింది. మొన్నటి వరకు పూర్తి గ్రామీణ ప్రాంతంగా ఉన్న చేవెళ్లలో ప్రస్తుతం పట్టణ వాతావరణం సంతరించుకుంటోంది. వికారాబాద్ ఎస్పీ పరిధిలో కొనసాగినప్పుడు చేవెళ్లలోనే డీఎస్పీ కార్యాలయం ఉండేది. అనంతరం మొయినాబాద్ లో పోలీసుస్టేషన్చే వెళ్ల, షాబాద్, శంకర్ పల్లి ఠాణాలను సైబరాబాద్ కమి షనరేట్లోకి మార్చిన అనంతరం.. ఏసీపీ కార్యాలయంగా మారింది. మొదటి నుంచి మొయినాబాద్ మాత్రం సైబరాబాద్ కమిషనరేట్లోనే ఉంది. అనంతరం కమిషనరేట్ పరిధిలోని అన్ని ఠాణాలకు ఎస్ హెచ్వోలను ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించారు. తాజాగా ప్రభుత్వం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కొనసాగిన చేవెళ్ల ప్రాంతాన్ని నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లోకి మారింది. జోన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి.. ఐపీఎస్ అధికారికి డీసీపీగా బాధ్యతలు అప్పగించింది. మొయినాబాద్ లో తాత్కాలిక భవనంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మొయినాబాద్ కేంద్రంగా ఏసీపీ ఏసీపీ కార్యాలయం రానుంది. ఇందుకు సంబంధించి అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. దీని పరిధిలో మొయినాబాద్, షాబాద్, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని శంషాబాద్(పెద్దషాపూర్) ఠాణాలను చేర్చనున్నట్లు సమాచారం. చేవెళ్ల ఏసీపీ పరిధిలో శంకర్పల్లి, మోకిల, చేవెళ్ల ఠాణాలను చేర్చారు. మోకిల ఠాణా.. మొయినాబాదు అత్యంత సమీపంలో ఉంటుందని, చేవెళ్ల ఏసీపీ పరిధిలో చేర్చడంతో దూరం పెరుగుతుందన్న వాదన తెరపైకి వచ్చింది. షాబాద్ ను చేవెళ్ల ఏసీపీ పరిధిలోనే ఉంచి.. మోకిలను మొయినాబాద్ లో చేరిస్తే.. అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది.

**పెరుగుతున్న పోటీ...**

కొత్తగా ఏర్పాటవుతున్న మొయినాబాద్, చేవెళ్ల ఏసీపీ.. పోస్టింగ్లకు పెద్ద ఎత్తున పైరవీలు జరుగుతున్నట్లు సమాచారం. వికారాబాద్ ఎస్పీ పరిధిలో డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఓ అధికారి.. మొయినాబాద్ కేంద్రంగా ఏర్పడే నూతన ఏసీపీగా పోస్టింగ్ దక్కించుకునేందుకు భారీ వ్యూహాన్నే రచించినట్లు తెలుస్తోంది. షాబాద్, శంకర్పల్లి, చేవెళ్ల, మొయినాబాద్ ఠాణాలకు సీఐలుగా బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తవుతుండటంతో.. వీటిని దక్కించుకునేందుకు ఇతర ప్రాంతాల వారు పోటీ పడుతు న్నారు. ఈ నెలాఖరుకు ఇందుకు సంబంధించిన బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.




# పర్యావరణంపై మక్కువ: ఆదర్శ దంపతుల అవార్డు

## రవీంద్రభారతిలో అవార్డు ప్రధానం.. అందుకున్న డాక్టర్ చిరంజీవి దంపతులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఆదర్శ దంపతుల అవార్డు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం రవీంద్రభారతిలో వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదర్శ దంపతులకు కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మాజీ కేంద్ర మంత్రివర్యులు సముద్రాల వేణుగోపాల చారి, దైవజ్ఞ శర్మ హాజరై, డాక్టర్ చిరంజీవి దంపతులకు, ఆదర్శ దంపతుల అవార్డు ప్రధానం చేశారు.. పర్యావరణం పై మక్కువతో, పర్యావరణ రంగంలో వారు చేసిన అపారమైన సేవకు గాను, డాక్టర్ చిరంజీవి, హనీ ఫ్లోరెన్స్ ఆదర్శ దంపతుల అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చిరంజీవి మాట్లాడుతూ... ఈ మధ్యకాలంలో డాక్టరేట్ అందుకోవడం జరిగిందని, గురుతరమైన బాధ్యతతో సేవ చేస్తున్న సందర్భంగా వల్లూరి ఫౌండేషన్ అందించిన అవార్డుతో సమస్త మీద ఇంకా ఉన్నతమైన బాధ్యతను పెంచిందని తెలిపారు. పర్యావరణం మీద తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తమ సంస్థ తరపున విశేషంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బాపట్ల జిల్లాలో వైద్య రంగంలో విశేషంగా కృషి చేసినందుకు గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేకంగా అభినందించిందని డాక్టర్ చిరంజీవి తెలిపారు.



# మణికొండలో రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



**గండిపేట,మహా:** గండిపేట మండలంలోని మణికొండ డివిజన్ లో మణికొండ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2026 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం పంచవటి కాలనీలోని కమిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవే లక్ష్యంగా కొనసాగుతున్న మణికొండ రెడ్డి ఫౌండేషన్, సభ్యుల సహకారంతో మరింత బలాన్ని చేకూరుస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ రామకృష్ణ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు ఉపేంద్ర రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాల్ రెడ్డి, ప్రముఖ సినీ నటుడు శివారెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షులు కూచుకుల నరేందర్ రెడ్డి,ఫౌండేషన్ కార్యదర్శి కందడ శ్రీకాంత్ రెడ్డి, ట్రెజరర్ శ్రీపతి రెడ్డి మరియు సభ్యులు రామ సుబ్బా రెడ్డి, రామ్ రెడ్డి, వెంకటరమణ రెడ్డి, శరత్ రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కిషన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రవికాంత్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పోచమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న పామేన జ్యోతి భీంభరత్..



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్ నగర్ గ్రామంలోని పోచమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ బోనాల ఉత్సవాల్లో రంగారెడ్డి జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు పామేన జ్యోతి భీంభరత్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ సీనియర్ నాయకుడు శ్రీపాల్ రెడ్డి ఆమెను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పామేన జ్యోతి భీంభరత్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, రైతులు పాడిపంటలతో అభివృద్ధి చెందాలని, అమ్మవారిని కోరుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, మాణిక్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా లక్ష్మీనృసింహ స్వామి కళ్యాణం

**ఆమనగల్లు, మహా:** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో స్వయంభూ శ్రీ శ్రీ శ్రీ వేదాద్రి లక్ష్మీనృసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిపారు. ఈ బ్రహ్మోత్సవాలలో ఎంపీ డా.మల్లురవి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి స్వామి వారి కళ్యాణం అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలందరిపై ఉండాలని కోరారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



# నిరుపేదలకు సీఎం సహాయనిధి వరం

## చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీంభరత్



**మొయినాబాద్ మహా:** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని, చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీంభరత్ పేర్కొన్నారు. నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో మంజూరైన చెక్కులను ఆదివారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్ నగర్ లోని తన కార్యాలయంలో లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆనారోగ్యంతో బాధపడుతూ వివిద ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూతనిందించడం జరుగుతుందని చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని వందలాది మంది పేదలకు వైద్య సేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలాంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, భద్రప్ప, మొయినాబాద్ లీగల్ సెల్ అధ్యక్షుడు బైకని కుమార్ యాదవ్, మాధవరెడ్డి, జొన్నాడ మైసయ్య, కేబుల్ రాజు, సురంగల్ వెంకట్ రెడ్డి, చంద్రశేఖర్, గోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ జడ్పిటిసి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.









## ఘనంగా నేషనల్ "ఖో ఖో"

# ఛాంపియన్షిప్ పోటీలు

### జ్యోతి ప్రజలను చేసి పోటీలను ప్రారంభించిన రాష్ట్ర మంత్రులు వాకిటి, ఉత్తమ్

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా కాజీపేట రైల్వే స్టేడియంలో ఆదివారం 58వ సీనియర్ నేషనల్ ఖో ఖో ఛాంపియన్షిప్ మెన్, విమెన్ పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పౌరసరఫరాలు, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఖో ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సుధాంశ్ మిట్టల్, రాష్ట్ర ఖో ఖో అసోసియేషన్ అధ్యక్షుడు జంగా రాఘవ రెడ్డి, ప్రజాప్రతినిధులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలను ఇక్కడ నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వాగతం పలికినట్లు తెలిపారు. ఈ పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 1400 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున క్రీడాకారులకు అన్ని విధాలుగా సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 79 జట్లు ఈ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుండడం ఆనందదాయకంగా ఉందన్నారు. మిగతా క్రీడల కంటే కబడ్డీ, ఖోఖో క్రీడలను ప్రోత్సహిస్తుంటారని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కబడ్డీ, ఖోఖో ఆటలకు ప్రాధాన్యతనిస్తారని అన్నారు. చారిత్రక వరంగల్ నగరంలో జాతీయ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. చారిత్రక వారసత్వ నగరం గానే కాకుండా క్రీడల్లో వరంగల్ జిల్లాకు మంచి పేరు ఉందన్నారు. క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ క్రీడలలో దేశానికి పేరు తీసుకురావాలన్నారు. దేశంలో పుట్టిన విశ్వ క్రీడగా విశ్వ ఖ్యాతి కావాలన్నారు. కోటిన్నర రూపాయలతో జే ఎం ఎస్ లోని ఇండోర్ స్టేడియం ఖో ఖో ఇతర క్రీడల అభివృద్ధి కోసం రూ కోటిన్నర మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధీచిన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.





## యువకుడి దారుణ హత్య

### బండరాయితో మోది దారుణంగా హత్య

**షాద్ నగర్. మహా:** రంగారెడ్డి జిల్లా కొత్తూరు పరిధిలోని శివనగర్ కాలనీలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. అటుగా అంతకు ముందు వెళ్లిన స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొంతమంది వ్యక్తులు అక్కడే కాసేపటి కింద మద్యం తాగుతూ ఉన్నారని.. తదనంతరం ఏదో అలజడి రేగడంతో యువకుడిని బండరాయితో మోది చంపి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్య కు గురైన యువకుడు హైదరాబాద్ కు చెందిన వ్యక్తిగా గుర్తింపు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సంక్రాంతి సెలవుల్లో దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### కరీంనగర్ పోలీస్ కమీషనర్ శ్రీ గౌష్ ఆలం ఐపీఎస్

**కరీంనగర్ మహా:** సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి తమ సొంత ఊళ్లకు వెళ్లే సందర్భాలు ఎక్కువ. ఈ సమయంలో చోరీలను నివారించడానికి కరీంనగర్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. పండుగకు వెళ్లే ప్రజలు దొంగల బారిన పడకుండా ఉండటానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

**ఇంటి భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

**పోలీసులకు సమాచారం ఇవ్వండి:** మీరు ఊరెళ్లే ముందు మీ సమీప పోలీస్ స్టేషన్‌లో తప్పకుండా సమాచారం ఇవ్వండి. ఇది పెట్రోలింగ్ బృందాలు మీ ఇంటిపై ప్రత్యేక నిఘా ఉంచడానికి సహాయపడుతుంది.

**పొరుగువారి సహకారం:** మీ ఇంటిపై నిఘా ఉంచమని మీ ఇరుగుపొరుగు వారికి చెప్పండి. వారి సెల్ ఫోన్ నంబర్లు మీ దగ్గర ఉంచుకోండి. మీ ఇంటికి సంబంధించిన ఏవైనా అనుమానాస్పద విషయాలు ఉంటే వెంటనే మీకు తెలియజేయమని చెప్పండి.

**బంగారం, డబ్బు జాగ్రత్త:** మీరు ఊరెళ్లేటప్పుడు ఇంట్లో ఎక్కువ డబ్బు, బంగారం ఉంచకుండా వాటిని బ్యాంకు లాకర్‌లో భద్రపరచడం ఉత్తమం. బీరువా తాళాలను ఇంట్లో పెట్టకుండా మీతో తీసుకెళ్లండి.

**సామాజిక మాధ్యమాలతో జాగ్రత్త:** మీరు ఊరెళ్తున్నట్లు సోషల్ మీడియాలో, వాట్సాప్ స్టేటస్‌లలో పెట్టకండి. ఇది నేరగాళ్లకు మీ ఇల్లు ఖాళీగా ఉందని తెలియజేస్తుంది.

**లైట్లు వేసి ఉంచండి:** ఇంటికి తాళం వేసినప్పుడు, ఇంట్లోని ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచడం మంచిది. అలాగే, తాళం బయటకు కనిపించకుండా డోర్ కర్టెన్ వేయండి.

**సీసీ కెమెరాల ఏర్పాటు:** కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలను నివారించవచ్చు. ఈ విషయంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.

**అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండండి:** ఉదయం పూట పేపర్లు, పూల మొక్కలు అమ్మేవారి రూపంలో లేదా రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులపై నిఘా ఉంచండి. అలాంటి అనుమానితుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి.

**సైబర్ నేరాల పట్ల అప్రమత్తత:** పండుగ సందర్భంగా వచ్చే ఆన్‌లైన్ షాపింగ్ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. నకిలీ ఐడీలు సృష్టించి మోసాలు చేసే సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్త వహించాలి.

**అపరిచిత లింకులు తెరవకండి:** అవసరం లేకుండా వచ్చే మెసేజ్‌లలోని బ్లూ కలర్ లింకులను అస్సలు ఓపెన్ చేయవద్దు. లాటరీ తగిలిందని, గిఫ్ట్ వచ్చిందని, తక్కువ ధరకు వస్తువులు ఇస్తామని వచ్చే సందేశాలను నమ్మవద్దు.

**ఫిర్యాదుకు సహాయకారి:** ఒకవేళ మీరు సైబర్ నేరానికి గురై డబ్బులు పోగొట్టుకుంటే, వెంటనే గంటలోపు 1930 కి ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ అయ్యే అవకాశం ఉంది.

**అత్యవసర సహాయం కోసం:** సైబర్ నేరాల ఫిర్యాదు కోసం: 1930 (జాతీయ హెల్ప్‌లైన్), 112, 100

**ఆన్‌లైన్ ఫిర్యాదు కోసం:** www.cybercrime.gov.in

**అత్యవసర సమయంలో డయల్ 100 కి కాల్ చేయండి**

పోలీసులకు ప్రజలు సహకరించాలని, నిరంతరం సమన్వయంతో ఉంటే చోరీలను నియంత్రించడం చాలా సులభం అని పోలీసులు పేర్కొన్నారు. సురక్షితమైన ప్రయాణం చేసి, జాగ్రత్తగా పండుగ జరుపుకోవాలని కరీంనగర్ పోలీసులు కోరారు.

## ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి



### ఎంపీ, ఎమ్మెల్యే

**ఆమనగల్లు, మహా :** విశ్వాసాన్ని నిలబెట్టి, పారదర్శకంగా గ్రామాభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం మాడ్గుల మండల కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్లను ఓ ప్రవేట్ ఫంక్షన్ హాల్లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధులుగా ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి హాజరై నూతన సర్పంచ్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల, ప్రజాస్వామ్య పరిరక్షణకు నిబద్ధతతో పనిచేయాలని,మనపై విశ్వాసంతో ఓట్లు వేసి గెలిపించారని, పార్టీలను పక్కన పెట్టి, అందరిని కలుపుకొని పోవాలని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి అని సూచించారు. అంతేకాకుండా గ్రామాల్లోని ప్రతి సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయాలన్నారు.మీకు అండగా ఉంటూ మీ గ్రామాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పీబిసి మెంబర్ బాలాజీ సింగ్, టిపిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బట్టు కిషన్ రెడ్డి,మార్కెట్ చైర్మన్ యాట గీతా, బ్లాక్ అధ్యక్షులు నర్సింహా, నాయకులు దళపతి నూతన సర్పంచ్లు పాల్గొన్నారు.



## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి..

**మొయినాబాద్ మహా:** గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్ నగర్ గ్రామానికి చెందిన సామ వేమారెడ్డి వయస్సు (46) వృత్తి డ్రైవర్ ఆదివారం సాయంత్రం 4:30గంటలకు తన బైక్ పై మొయినాబాద్ వెళ్తుండగా మార్గమధ్యలో భాస్కర ఆసుపత్రి వద్ద వెనక నుండి గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో ఎగిరి రోడ్డుపై పడ్డ సామ వేమరెడ్డి, తలకు బలమైన గాయమైంది. వెంటనే స్థానికులు సామ వేమరెడ్డిని చికిత్స నిమిత్తం స్థానిక భాస్కర ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా ఒడ్డె ఓబన్న జయంతి ఉత్సవాలు



**ఎల్బీనగర్,మహా:** స్వాతంత్ర్య సమర యోధుడు ఒడ్డె ఓబన్న 219 జయంతి ఉత్సవాలు హయత్ నగర్ మండల కేంద్రంలోని మహనీయుల విగ్రహాల వద్ద బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎత్తిరి భీమ్ రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డే ఓబన్న సుబ్బమ్మ సుబ్బయ్య దంపతులకు రాయలసీమ నంద్యాల జిల్లాలో జన్మించారని అన్నారు. ఓబన్న రాయలసీమ గడ్డమీద స్వాతంత్ర సమరభేరి మోగించి బ్రిటిష్ పాలకుల పాలనపై సమర శంఖారావం పూరించి బ్రిటిష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించి గడగడలాడించిన సమరయోధుడు ఓబన్న సైరా నరసింహారెడ్డి సమస్థానంలో మండల దిశగా విధులు నిర్వహించారని అన్నారు. వడ్డే ఓబన్న అంటే ధైర్యం త్యాగం సామాజిక న్యాయం అని కొనియాడారు.వడ్డే ఓబన్న సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఆయన యొక్క జయంతి వర్ధంతిలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం గర్వించదగ్గ విషయం అని ఆయన యొక్క జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని రాబోయే తరాలకు వడ్డే ఓబన్న జీవిత చరిత్ర తెలియజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయన యొక్క విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో హయత్ నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ ,ఎస్ ఐ వెంకటరెడ్డి,లక్ష్మీనారాయణ,పారందస్వామి,రాష్ట్ర ఉపాధ్యక్షులు తెలంగాణ అంబేద్కర్ సంఘం,ఎర్ర రవీందర్ సీనియర్ నాయకులు ఎమ్మార్పీఎస్ పవన్ కుమార్ ,హయత్ నగర్ మండల నాయకులు వడ్డెర సంఘం మోసస్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వడ్డెర సంఘం ఎత్తరి అరవింద్ సీనియర్ నాయకులు వడ్డెర సంఘం తదితరులు పాల్గొన్నారు.





## హుజూర్ నగర్ లో మన శంకర వరప్రసాద్ విడుదల సంబరాలు

**హుజూర్ నగర్ మహా:** అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షులు రవణం స్వామినాయుడు ఆదేశాల మేరకు హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో మెగా అభిమానుల సమావేశం జరిగింది ఈ సందర్భంగా మన శంకర వరప్రసాద్ సినిమా పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. అనంతరం మెగా అభిమాన సంఘాల నాయకులు సైదులు యాదవ్, హాసన్ మియా, శీలం నాగరాజు లు మాట్లాడుతూ సోమవారం ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా విడుదల అవుతున్న మెగాస్టార్ చిరంజీవి మన శంకర వరప్రసాద్ సినిమా ఘన విజయం సాధిస్తుందని,చిరంజీవి సినిమా సంక్రాంతికి విడుదల కావడం పండగ ను రెట్టింపు చేస్తుందన్నారు.ఈ సినిమా కోసం మెగా అభిమానులతో పాటు సినీ అభిమానులందరూ ఎదురు చూస్తున్నారని తెలిపారు.సమావేశం అనంతరం మెగా అభిమానులు పట్టణంలో రాలీ నిర్వహించారు ఈ కార్యక్రమం లో మెగా అభిమానులు భాస్కర్, శివ,నాగరాజు, మహేష్, ఉదయ్ పవన్,చిరంజీవి, ఆకాష్, రాంబాబు, విజయ్, సత్యం, అల్లవుద్దిన్,పలువురు అభిమానులు పాల్గొన్నారు

## జేబి కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో

# సంక్రాంతి సంబరాలు

### ప్రారంభించిన రాజనాల శ్రీహరి



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం లో పోతన నగర్ ఆడిటోరియంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంలో జేబి కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ నిర్వాకులు జడల శివ హరిత ఆధ్వర్యంలో వరంగల్ సంక్రాంతి సకల కలల క్రాంతి పురస్కారం 2026 ముగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలిచిన కళాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాజనాల శ్రీవారి మాట్లాడుతూ జడల శివ హరిత దంపతులు గత 30 సంవత్సరాలుగా జేబి ఆర్ట్స్ సొసైటీ ద్వారా ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి కళాకారులను వెలికి తీశారని రాజనాల కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మరుపల్ల రవి, ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ లయన్ ఆడెపు రవీందర్. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చిప్ప వెంకటేశ్వర్లు నేత, సింగర్ రాము, శ్రీనివాసు హరినాథ్ హరిప్రియ తో పాటు వందల మంది కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.



## మంత్రులకు ఘన స్వాగతం

# పలికిన జిల్లా అధ్యక్షులు

హన్మకొండ మహా; హనమకొండ జిల్లా కాజిపేట రైల్వే స్టేడియంలో నిర్వహించిన 58వ జాతీయ స్థాయి సీనియర్ ఖో ఖో ఛాంపియన్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకాటి శ్రీహరి తో పాటు చైర్మన్ శివ సేన రెడ్డిని వరంగల్ కుడా చైర్మన్, లను హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రాం రెడ్డి మడికొండ వద్ద మంత్రులకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# కొత్త ఫోన్: పోకో ఎం8 5జీ వచ్చేసింది..!

స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ 'పోకో' భారత మార్కెట్లో 'పోకో ఎం8 5జీ' పేరుతో 5జీ స్మార్ట్‌ఫోన్ విడుదల చేసింది. మిడ్‌రేంజ్ ధర విభాగపు కస్టమర్లే లక్ష్యంగా వచ్చిన ఈ స్మార్ట్‌ఫోన్‌లో శక్తివంతమైన ప్రాసెసర్, అధునాతన కెమెరా సెటప్, భారీ బ్యాటరీ ప్రధాన ఆకర్షణలుగా ఉన్నాయి. ఇందులో క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 6 జెన్ 3 చిప్‌సెట్‌ను అమర్చారు. 6.77 అంగుళాల 3డీ కర్వ్‌డ్ డిస్‌ప్లే ఉంది. ఇది 120హెచ్‌జెడ్ రిఫ్రెష్‌రేట్, 240హెచ్‌జెడ్ టచ్ శాంప్లింగ్ రేట్, 3,200 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌కు సపోర్ట్ చేస్తుంది. వెట్ టచ్ టెక్నాలజీని కలిగి ఉంది. దీంతో తడి చేతులతో ఉపయోగించినా, తేలికపాటి వర్షంలోనూ పనిచేస్తుంది. వెనుక భాగంలో 50ఎంపీ ప్రైమరీ కెమెరాతో పాటు 2ఎంపీ లైట్ ఫ్యూజన్ 400 సెన్సర్ అందించారు. ముందు భాగంలో 20ఎంపీ సెల్ఫీ కెమెరా ఉంది. ఈ స్మార్ట్‌ఫోన్‌లో 5,520ఎంహెచ్‌ఏ సామర్థ్యం కలిగిన భారీ బ్యాటరీ ఉంది. ఇది 45డబ్ల్యూ ఫాస్ట్ వైర్డ్ ఛార్జింగ్, అలాగే 18డబ్ల్యూ రివర్స్ వైర్డ్ ఛార్జింగ్‌కు సపోర్ట్ ఇస్తుంది. నాలుగేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్లు ఉంటాయి. మొత్తం మూడు వేరియంట్లలో లభిస్తుంది. 6జీబీ ర్యామ్+128జీబీ స్టోరేజ్ ధర రూ.18,999గా కంపెనీ నిర్ణయించింది. 8జీబీ ర్యామ్ + 128జీబీ స్టోరేజ్ ధర రూ.21,999గా.. 8జీబీ ర్యామ్ + 256జీబీ స్టోరేజ్ ధర రూ. 21,999గా ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్ కార్డులపై రూ.2,000 వరకు డిస్కౌంట్ లభిస్తుంది. జనవరి 13 నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో ఈ ఫోన్ విక్రయాలు ప్రారంభం కానున్నాయి.

# పెర్ఫ్యూమ్ బ్రాండ్లకు నిధుల పరిమళం



**బిజినెస్ డెస్క్:** కొంతకాలంగా దేశీ ఫ్రాగ్రెన్స్ మార్కెట్‌పై ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కొత్త తరం లగ్జరీ పెర్ఫ్యూమ్ బ్రాండ్లు పెద్ద ఎత్తున నిధులను సమీకరిస్తున్నాయి. న్యూఢిల్లీకి చెందిన ఫ్రాగానోట్స్ గతేడాది ఆగస్టులో రుకమ్ క్యాపిటల్ నుంచి ప్రీ-సిరీస్ ఫండింగ్ కింద 1 మిలియన్ డాలర్లు సమీకరించింది. అటు బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న హిరా ఫ్రాగ్రెన్సెస్ మాతృ సంస్థ మియోలా గతేడాది అక్టోబర్‌లో ప్రీ-సిరీస్ ఎ రౌండ్ కింద 6 మిలియన్ డాలర్లను సమకూర్చుకుంది. ఇక ఇండోర్‌కి చెందిన హౌస్ ఆఫ్ ఈఎం5 సంస్థ బోట్ సహవ్యవస్థాపకుడు అన్ గుప్తా నుంచి నిధులు సేకరించింది. ఇప్పటివరకు రూ. 5-6 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. మరోవైపు, గుజరాత్‌కి చెందిన అదిల్ ఖాద్రి బ్రాండ్.. షార్క్ ట్యాంక్ ఇండియా షోలో రూ. 50 లక్షల ఫండింగ్ దక్కించుకుంది. 2023లో ఏర్పాటైన గుడ్‌మెల్ట్స్ అనే బ్రాండ్ కూడా ఆనికట్ క్యాపిట్ల నుంచి ప్రీ-సీడ్ ఫండింగ్‌ని సమకూర్చుకుంది.

### భారీగా కార్యకలాపాల విస్తరణ..

శశాంక్ చౌరీ ప్రారంభించిన హౌస్ ఆఫ్ ఈఎం5 తొలి ఏడాదిలో (2022-23) కేవలం 900 ఆన్‌లైన్ ఆర్డర్లను ప్రాసెస్ చేసింది. ప్రస్తుతం రోజుకు 2,000 ఆర్డర్లు, నెలకు దాదాపు 80,000 పైగా బాటిల్స్‌ని విక్రయిస్తోంది. కంపెనీ కస్టమర్లలో అత్యధిక శాతం వాటా 28-45 ఏళ్ల వారిదే ఉంటోంది. గత మూడేళ్లలో హౌస్ ఆఫ్ ఈఎం5 సుమారు రూ. 200 కోట్ల టర్నోవరు సాధించింది. వచ్చే మూడేళ్లలో రూ. 500 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంది. అటు ఆఫ్‌లైన్‌లో కూడా కార్యకలాపాలను విస్తరించే ప్రణాళికల్లో ఉంది. ఆ తర్వాత అమెజాన్ ఫస్ట్ ద్వారా గ్లోబల్‌గా కూడా అవకాశాలను అందిపుచ్చుకోవాలని భావిస్తోంది. తమ కంపెనీ లాభాల్లోనే కొనసాగుతోందని, ఇన్వెస్టర్లు ఆసక్తిగానే ఉన్నా, ప్రస్తుతం మరిన్ని నిధులు సమీకరించాల్సిన తక్షణ అవసరమేమీ లేదని శశాంక్ తెలిపారు. మరోవైపు, 2018లో ప్రారంభమైన ఆదిల్ ఖాద్రి ప్రీమియం సెగ్మెంట్‌పై ప్రధానంగా దృష్టి పెడుతోంది. ప్రస్తుతం ప్రతి నెలా రూ. 11-12 కోట్ల ఆదాయం ఆర్జిస్తోంది. థర్డ్ పార్టీ తయారీ సంస్థ భాగస్వామ్యంతో నాలుగైదు నెలలకు సరిపడ నిల్వలను ఉత్పత్తి చేసి పెట్టుకుంటోంది. అంతర్గతంగా నిధులతోనే విస్తరణ చేపడుతోంది. హైదరాబాద్‌తో పాటు ముంబై, లక్నో, జైపూర్, సూరత్, అహ్మదాబాద్ తదితర నగరాల్లో దాదాపు 50 స్టోర్స్ నిర్వహిస్తోంది. వచ్చే రెండున్నర-మూడేళ్లలో స్టోర్స్ సంఖ్యను 111కి పెంచుకునే యోచనలో ఉంది.

### 2 బిలియన డాలర్ల మార్కెట్..

దేశీ ఫ్రాగ్రెన్స్ మార్కెట్ పరిమాణం ప్రస్తుతం సుమారు 2 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంటుందని మోతీలాల్ ఓస్వాల్ ఓ నివేదికలో తెలిపింది. ఇది 2030 నాటికి 4.08 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో పెర్ఫ్యూమ్ బ్రాండ్లు అవకాశాలను అందిపుచ్చుకోవడంపై మరింతగా దృష్టి పెడుతున్నాయి. 2022లో గరిమా కక్కర్ ప్రారంభించిన ఫ్రాగానోట్ వచ్చే రెండేళ్లలో మెట్రోల్లో ఆఫ్‌లైన్ కార్యకలాపాలను మరింత పటిష్టం చేసుకునే ప్రయత్నాల్లో ఉంది. అలాగే వారణాసి, సోలన్‌లాంటి ప్రాంతాల్లోనూ విస్తరిస్తోంది. అటు అంతర్జాతీయ మార్కెట్లపైనా దృష్టి పెడుతోంది. ప్రధానంగా వచ్చే మూడేళ్లలో ప్రీమియం అఫోర్డబుల్ సెగ్మెంట్లో స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని భావిస్తోంది. అటు హీరా ఫ్రాగ్రెన్సెస్ మాతృ సంస్థ మియోలా కూడా వచ్చే 12-18 నెలల్లో కార్యకలాపాలను విస్తరించే యోచనలో ఉంది. ఇటీవలే సమీకరించిన నిధుల్లో నుంచి సుమారు 2-2.2 మిలియన్ డాలర్లను ఇందుకోసం వెచ్చించనున్నట్లు సంస్థ తెలిపింది.

# బ్యాంకులకు వారమంతా సెలవులే!!



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనవరి నెలకు సంబంధించిన బ్యాంకు సెలవుల షెడ్యూల్‌ను ప్రకటించింది. స్వామి వివేకానంద జయంతి, మకర సంక్రాంతి, తిరువళ్లువర్ దినోత్సవం, ఉళవర్ తిరునాళ్ వంటి పండుగల నేపథ్యంలో వచ్చే వారం దేశంలోని పలు రాష్ట్రాల్లో బ్యాంకులు మూసి ఉండనున్నాయి. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)తో సహా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు ప్రతి నెల రెండవ, నాల్గవ శనివారాలు, అన్ని ఆదివారాలు వారపు సెలవులుగా పాటిస్తాయి. ఇదే క్రమంలో ఈ జనవరి నెలలో మొత్తం 16 బ్యాంకు సెలవులు (వారాంతాలు కలుపుకొని) ఉంటాయి. ప్రాంతీయ పండుగలు, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాల ఆధారంగా సెలవులు మారవచ్చని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. అందువల్ల ఖాతాదారులు తమ స్థానిక బ్యాంకు శాఖ సెలవు షెడ్యూల్‌ను ముందుగానే తెలుసుకుని అందుకు అనుగుణంగా తమ బ్యాంకు పనులను ప్లాన్ చేసుకోవడం అవసరం.

**వచ్చే వారం బ్యాంకు సెలవులు ఇవే..**

**జనవరి 12:** స్వామి వివేకానంద జయంతి - పశ్చిమ బెంగాల్..
**జనవరి 14:** మకర సంక్రాంతి / మాఘ్ బిహు - గుజరాత్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, అసోం..
**జనవరి 15:** ఉత్తరాయణ పుణ్యకాళం / పొంగల్ / మాఘే సంక్రాంతి / మకర సంక్రాంతి - తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సిక్కిం
**జనవరి 16:** తిరువళ్లువర్ దినోత్సవం - తమిళనాడు
**జనవరి 17:** ఉళవర్ తిరునాళ్ - తమిళనాడు
**జనవరి 18:** ఆదివారం - దేశవ్యాప్తంగా బ్యాంకు సెలవు

**బ్యాంకులు మూసివున్నా ఇవి పనిచేస్తాయి**

బ్యాంకు సెలవు దినాల్లో కూడా వినియోగదారులు నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, ఏటీఎం నగదు ఉపసంహరణ వంటి సేవలను సాధారణంగానే వినియోగించుకోవచ్చు. అయితే, నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ ప్రకారం చెక్కులు, ప్రామిసరీ నోట్లకు సంబంధించిన లావాదేవీలు సెలవు రోజుల్లో జరగవు.



# ఆయిల్ పామ్ సాగుపై పెరుగుతున్న ఆసక్తి


వంటనూనెల పంటలతో పోలిస్తే అయిదు రెట్లు అధిక దిగుబడి, దాదాపు 30 ఏళ్ల వరకు ఉత్పాదకత ఉండే ఆయిల్ పామ్ సాగుపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోందని గోద్రెజ్ ఆగ్రోవెట్ సీఈవో (ఆయిల్ పామ్ బిజినెస్) సౌగత నియోగి తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీలు, ధరలకు హామీ, ప్రోత్సాహకాలను ఇస్తుండటం తదితర చర్యలు దీనికి సానుకూలంగా ఉంటున్నాయని చెప్పారు. దీనికి సంబంధించిన జాతీయ మిషన్ కింద 2019-20లో 3.5 లక్షల హెక్టార్లుగా ఉన్న ఆయిల్ పామ్ సాగును 2025-26 నాటికి 10 లక్షల హెక్టార్లకు పెంచుకోవాలని లక్ష్యాలు ఉన్నాయని నియోగి తెలిపారు. అయితే, గతేడాది నవంబర్ నాటికి ఇది లక్ష్యానికన్నా తక్కువగా 6.20 లక్షల హెక్టార్లకు మాత్రమే చేరినప్పటికీ, సాగుపై రైతుల్లో ఆసక్తి పెరుగుతుండటం సానుకూల అంశమన్నారు. విస్తరణకు తగ్గట్లుగా మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం, పర్యావరణహితమైన సాగు విధానాల్లాంటివి అమలైతే రైతులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని నియోగి చెప్పారు. ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన, లాభదాయకమైన పంటగానే కాకుండా దేశీయంగా వంటనూనెల భద్రత సాధనకు కూడా ఉపయోగపడగలదని వివరించారు.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# "ఇంటర్నెట్ నాకు తెలియదు": అజిత్ దోవల్



అజిత్ దోవల్ ఇండియన్ జేమ్స్ బాండ్‌గా పిలుచుకునే ఈ ఆఫీసర్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. భారత గూఢచారిగా ఎన్నో సీక్రెట్ మిషన్లలో పాల్గొని దేశ భద్రతలో కీలక పాత్ర పోషించారు. తాజాగా ఆయన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఇంతవరకూ ఇంటర్నెట్ వాడడం లేదని, మొబైల్‌కు సైతం చాలావరకూ దూరంగా ఉంటానని తెలిపారు. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మాతృభూమి రక్షణ కోసం అనునిత్యం తపించే ఈ ఆఫీసర్ దేశం కోసం ఎన్నో రిస్కీ ఆపరేషన్‌లు చేశారు. 1980 దశకంలో పాకిస్థాన్‌లో ఏడేళ్లపాటు ముస్లిం వ్యాపారిగా, బిచ్చగాడిగా నటిస్తూ భారత్‌కు ఎంతో కీలక సమాచారాన్ని చేరవేశారు. అంతేకాకుండా అమృత్‌సర్ గోల్డెన్ టెంపుల్‌లో నక్కిన మిలిటెంట్లను బయిటకి తీసేందుకు అండర్ కవర్ ఏజెంట్‌గా పనిచేశారు. ఇలా భారత్ కోసం ఆయన ప్రాణాలు తెగించి చేసిన ఆపరేషన్‌లు అనేకం. అందుకే ఆయనను అందరూ ఇండియన్ జేమ్స్‌బాండ్ అని పిలుచుకుంటారు. అయితే శనివారం ఢిల్లీ భరత మండపంలో జరిగిన వికసిత్ భారత్ యంగ్ లీడర్స్2026 కార్యక్రమం జరిగింది. అందులో అజిత్ దోవల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ" నేను అసలు ఇంటర్నెట్ వినియోగించను. ఇది నిజం అంతే కాకుండా మొబైల్ ఫోన్ అసలు వాడను. కేవలం విదేశాల్లో ఉన్నప్పుడు మా కుటుంబసభ్యులతో మాట్లాడడానికి తప్ప దానిని వినియోగించను. నాపని అంతా అలానే సాగుతుంది" అని అజిత్ దోవల్ అన్నారు. 1945లో ఉత్తరాఖండ్‌లో జన్మించిన అజిత్ దోవల్ 1968లో ఐపీఎస్ సాధించి కేరళ క్యాడర్‌కు ఎంపికయ్యారు. కాందహార్ ఫ్లైట్ హైజాక్ సమయంలో భారత్ తరపున చర్చలలో పాల్గొన్నారు. అంతేకాకుండా అత్యంత చిన్న వయసులో కీర్తి చక్ర అవార్డుకు ఎంపికయిన పోలీసు ఆఫీసర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. అజిత్ దోవల్ ఇంటిలిజెన్స్, ఇంటర్నల్ సెక్యూరిటీ, కౌంటర్ టెర్రరిజం విభాగాల్లో దశాబ్దాల కాలం పాటు భారత్‌కు సేవలందించారు.



# అమెరికాలో కాల్పులు.. ఆరుగురి మృతి

అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం చోటు చేసుకుంది. యూఎస్‌ఏలోని మిసిసిప్పిలోని ఓ దుండగుడు కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఆరుగురి మృత్యువాత పడ్డారు. కాల్పులకు పాల్పడ్డ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే నిందితుడు ఒక చోట కాకుండా వేరు వేరు చోట్ల కాల్పులకు తెగబడినట్లు సమాచారం. అమెరికా వార్తా సంస్థలు డబ్ల్యూటీవీఏ, ఎన్‌బీసీ న్యూస్ తెలిపిన వివరాల ప్రకారం కాల్పులకు పాల్పడ్డ వ్యక్తిని పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇటీవల అమెరికాలో కాల్పుల ఘటనలు తీవ్రంగా పెరిగాయి. 2026 ప్రారంభం నుంచే మిసిసిప్పి, టెక్సాస్, డల్లాస్, హ్యూస్టన్ వంటి నగరాల్లో పెద్ద ఎత్తున కాల్పులు జరిగి, పలువురు మరణించగా, మరికొందరు గాయపడ్డారు. జనవరి 1, 2026 మిసిసిప్పి నైట్‌క్లబ్‌లో నూతన సంవత్సర వేడుకల సమయంలో కాల్పులు జరిగాయి. పలువురు గాయపడ్డారు. జనవరి 1, 2026 - డల్లాస్, టెక్సాస్‌ల్లో జరిగిన మరో కాల్పుల ఘటనలో అనేక మంది గాయపడ్డారు. జనవరి 1, 2026 - హ్యూస్టన్, టెక్సాస్‌ల్లో కొత్త సంవత్సరం మొదటి రోజే కాల్పులు చోటుచేసుకోవడం అమెరికాలో గన్ వైలెన్స్ సమస్య ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తుంది. దాంతో అమెరికాలో గన్ నియంత్రణపై చట్టసభల్లో మళ్లీ చర్చలు మొదలయ్యే అవకాశం ఉంది. 2025లో అమెరికాలో హత్యలు, పెద్ద ఎత్తున హింసాత్మక ఘటనలు కొంత తగ్గినా, గన్ వైలెన్స్ మాత్రం కొనసాగుతూనే ఉంది. 2026 మొదటి 10 రోజుల్లోనే 4 ప్రధాన కాల్పుల ఘటనలు నమోదు కావడం గమనార్హం.




# నోబెల్ శాంతికి నేనే బెస్ట్: ట్రంప్



**న్యూయార్క్ /వాషింగ్టన్:** గతేడాది నోబెల్ శాంతి బహుమతి తనకు దక్కలేదన్న అక్కసును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వెళ్లగక్కారు. అసలు ఆ పురస్కారానికి తనకంటే అర్హుడు చరిత్రలోనే మరెవరూ లేరని చెప్పుకున్నారు. వెనెజువెలా చమురు నిల్వలకు సంబంధించిన ప్రణాళికల గురించి చర్చించేందుకు చమురు, సహజవాయు కంపెనీల ఉన్నతాధికారులతో శుక్రవారం వైట్‌హౌస్‌లో జరిపిన సమావేశాన్ని ట్రంప్ ఇందుకు వేదికగా మార్చుకోవడం విశేషం. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు ఏమీ చేయకపోయినా నోబెల్ శాంతి పురస్కారం దక్కిందంటూ ఈ సందర్భంగా ఆయన వాపోయారు. ''రెండోసారి అధ్యక్ష పీఠం ఎక్కాక కేవలం 8 నెలల వ్యవధిలోనే ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 8 అతి పెద్ద యుద్ధాలను ఆపాను. 36 ఏళ్లు, 32, 31, 28, 25 ఏళ్లుగా సాగుతున్న యుద్ధాలవి. తద్వారా లక్షలాది మంది ప్రజలు చనిపోకుండా కాపాడా''అన్నారు. అంతేకాదు, 'భారత్, పాకిస్తాన్ మధ్య పూర్తిస్థాయి యుద్ధం దిశగా వెళ్తున్న భారీ ఘర్షణను కూడా ఆపేశా'నని మరోసారి చెప్పుకున్నారు. రెండు అణ్వాయుధ దేశాల మధ్య యుద్ధాన్ని ఆపి లక్షలాదిగా ప్రాణ నష్టాన్ని నివారించినందుకు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇటీవల అమెరికా పర్యటన సందర్భంగా తనకు కృతజ్ఞతలు కూడా తెలిపారని గుర్తు చేశారు. భారత్, పాక్ మధ్య యుద్ధాన్ని ఆపానని ట్రంప్ చెప్పుకోవడం గత రెండు రోజుల్లో ఇది రెండోసారి. ''అసలు ఒబామాకు నోబెల్ పురస్కారం ఎందుకిచ్చారో ఇప్పటికీ కనీసం ఆయనకు కూడా తెలియదు. నాకు మాత్రం వాస్తవానికి నేను ఆపిన ప్రతి యుద్ధానికి ఒక నోబెల్ శాంతి బహుమతి చొప్పున ఇవ్వాలి''అని చెప్పుకున్నారు.

# పునాదుల్లో భారీగా బంగారం.. విద్యార్థి చొరవతో..

**గదగ్:** కర్ణాటకలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. గదగ్ జిల్లా, లక్కుండి గ్రామంలో ఒక ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా కూలీలు పునాదుల కోసం భూమిని తవ్వుతుండగా అనూహ్యంగా బంగారు నిధి లభ్యమయ్యింది. పునాదుల్లో పసిడి ఆభరణాలు బయటపడటంతో ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున కలకలం చెలరేగింది. పాతకాలపు రాగి బిందెలో దాచి ఉంచిన ఈ విలువైన సంపదను చూసిన స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ నిధిని స్థానికంగా ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రజ్వల్ రిత్విక్ అనే విద్యార్థి గుర్తించాడు. భూమిలో కనిపిస్తున్న రాగి బిందెను గమనించిన ఆ బాలుడు, వెంటనే గ్రామ పెద్దలకు ఆ సమాచారం అందించాడు. ఆ రాగి బిందెను తెరిచి చూడగా, అందులో వివిధ రకాల బంగారు ఆభరణాలు కనిపించాయి. బాలుడి నిజాయితీని గ్రామస్తులు మెచ్చుకున్నారు. విషయం తెలుసుకున్న గదగ్ జిల్లా ఎస్పీ రోహన్ జగదీష్ నేతృత్వంలో పోలీసుల బృందం, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అధికారులు ఆ బంగారాన్ని పరిశీలించి, అది సుమారు 470 గ్రాముల బరువు ఉన్నట్లు నిర్ధారించారు.



ఆ రాగి బిందెలో మొత్తం 22 రకాల బంగారు వస్తువులు ఉన్నాయని, వాటిలో గొలుసులు, చెవి కమ్మలు వంటి విలువైన ఆభరణాలు ఉన్నట్లు ఎస్పీ మీడియాకు తెలిపారు. అధికారులు ఈ బంగారు నిధిని తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. నిబంధనల ప్రకారం లభ్యమైన 470 గ్రాముల బంగారాన్ని ప్రభుత్వ ట్రెజరీకి తరలించారు. పురావస్తు శాఖ నిపుణులు ఈ ఆభరణాల చారిత్రక నేపథ్యాన్ని పరిశీలించే అవకాశం ఉంది.



# పొగిడినా.. విమర్శించినా నవ్వుతా : అనిల్ రావిపూడి

**"ప్రతి సంక్రాంతికీ నా సినిమా ఉండాలని నేను కోరుకోవడం లేదు. ఈ బ్రాండ్ నాకు వద్దు. కుదిరినప్పుడల్లా సంక్రాంతికి వచ్చి కుర్రాడు ఏదో నవ్విస్తున్నాడు అనే ఫీలింగ్ ఉంటే చాలు" అని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన తాజా సినిమా 'మన శంకర వరప్రసాద్‌గారు'. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్ గా నటించగా, వెంకటేశ్ కీలక పాత్రలో నటించారు. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించిన ఈ చిత్రం రేపు(సోమవారం) రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అనిల్ రావిపూడి పంచుకున్న విశేషాలు...**

ఈ సినిమా అంతా చిరంజీవిగారు చేసిన శంకరవరప్రసాద్ క్యారెక్టర్ పాయింట్ ఆఫ్ వ్యూలోనే సాగుతుంది. ఈ తరహా సినిమా చేయడం నాకు కూడా కొత్తే. ఈ చిత్రంలో ఫన్ ఎలిమెంట్స్‌తో పాటు ఎమోషనల్ రైడ్ కూడా ఉంది. భార్యా భర్తల మధ్య ఓ ఎమోషనల్ కాన్‌ఫ్లిక్ట్ వచ్చినప్పుడు దాన్ని ఎలా హ్యాండిల్ చేస్తారనే విషయాన్ని ఈ సినిమాలో చూపించాను. చిరంజీవిగారు సెల్ఫ్ సెటైర్స్ వేసుకున్నారు. అది ఆయన గొప్పదనం. ఇది ఆడియన్స్‌ను అలరించడానికి మాత్రమే. కర్ణాటకకు చెందిన మైనింగ్ బిజినెస్‌మేన్ వెంకీ గౌడ అనే పాత్రలో వెంకటేశ్‌గారు నటించారు. చిరంజీవి, వెంకటేశ్‌గార్ల కాంబినేషన్ సీన్స్ 20 నిమిషాలు ఉంటాయి. వారితో షూటింగ్ చేసిన సమయం నా లైఫ్‌లో మెమొరబుల్ మూమెంట్. మా సినిమా టికెట్ ధరలు ఫ్యామిలీ ఆడియన్స్ చూసేలా ఉండాలని, చిరంజీవిగారు స్ట్రిక్ట్‌గా చెప్పారు. దీంతో మేం నార్మల్ హైక్స్ కోసమే రిక్వెస్ట్ పెట్టుకున్నాం. ఈ సినిమాలోని హుక్‌స్టెప్ సాంగ్ బాగా వైరల్ అవుతోంది. అయితే ఈ పాటకు బదులు మేం ముందుగా మరో మెలోడీ ట్యూన్ అనుకున్నాం. కానీ, ఆ తర్వాత వద్దనుకుని లాస్ట్ షెడ్యూల్‌లో ఈ 'హుక్ స్టెప్' సాంగ్‌ను షూట్ చేశాం. ఫైనల్‌గా ఇలా మెగా మ్యాజిక్ జరిగింది. భీమ్స్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. నా సినిమాల ప్రొడక్షన్స్ , బడ్జెట్ విషయాల్లో నేను చాలా జాగ్రత్తలు తీసుకుంటాను. అయితే నా లైఫ్‌లో నేను ప్రొడక్షన్స్ , డిస్ట్రిబ్యూషన్ చేయను. ఇక సోషల్ మీడియాలో నాపై కొన్ని విమర్శలు వస్తుంటాయి. పొగడ్తలను స్వీకరిస్తున్నప్పుడు, విమర్శలను కూడా తీసుకోవాలి. అందుకే నేను దేనికీ A. నన్ను విమర్శించినా నవ్వుతా.. పొగిడినా నవ్వుతా. చిరంజీవి, వెంకటేశ్, బాలకృష్ణగార్లతో సినిమాలు చేశాను. నాగార్జునగారితో కూడా సినిమా చేయాలని ఉంది. అవకాశం కోసం చూస్తున్నాను. నా కొత్త సినిమా ఇంకా ఖరారు కాలేదు.

# నీకన్నా నాకే ఎంతో స్పెషల్.. మాటల్లో చెప్పలేను



ట్రోలింగ్‌ను ఎదుర్కోని హీరో లేడు. కెరీర్ తొలినాళ్లలో దారుణమైన ట్రోల్స్ చూశాడు అల్లు అర్జున్. 'గంగోత్రి' సినిమాలో అతడు ఆడవేషం కడితే అందరూ పడీపడీ నవ్వారు. అదే అల్లు అర్జున్ 'పుష్ప 2' మూవీలో చీరకట్టి తాండవం చేస్తే అదుర్స్ అంటూ ప్రశంసల వర్షం కురిపించారు.

**నాలుగు సార్లు రిపీట్**

హీరోగా తన తొలి సినిమా గంగోత్రితో ఎన్నో విమర్శలను ఎదుర్కొన్న బన్నీ తర్వాతి మూవీ 'ఆర్య'తో తనేంటో నిరూపించుకున్నాడు. ఈ సినిమాతోనే సుకుమార్ దర్శకుడిగా పరిచయమయ్యాడు. 'ఆర్య 2'తో వీరి కాంబినేషన్ మరోసారి హిట్టు అని నిరూపితమైంది. ఆ ధైర్యంతోనే ముచ్చటగా మూడోసారి జత కట్టి 'పుష్ప' సినిమా తీశారు. ఇది పాన్ ఇండియా స్థాయిలో ఆదరణ పొందడంతో పాటు భారీగా కలెక్షన్స్ కొల్లగొట్టింది. పుష్పకు సీక్వెల్‌గా వచ్చిన 'పుష్ప 2' చిత్రం అయితే రికార్డులు తిరగరాసింది. అల్లు అర్జున్‌ను తిరుగులేని పాన్ ఇండియా స్టార్‌గా నిలబెట్టింది. తనకు ఇంత గుర్తింపు తీసుకొచ్చిన సుకుమార్ అంటే బన్నీకి ఎనలేని గౌరవం. తన కెరీర్ తారాజువ్వలా వెలగడానికి ఆయనే కారణమని బలంగా నమ్ముతాడు. ఈరోజు (జనవరి 11న) సుకుమార్ పుట్టినరోజు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ ఎక్స్ (ట్విటర్) వేదికగా ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు.

**నా జీవితాన్ని మార్చేసిన రోజు**

హ్యాపీ బర్త్‌డే డార్లింగ్.. ఈరోజు నీకంటే కూడా నాకే ఎంతో ప్రత్యేకమైన రోజు. ఎందుకంటే నా జీవితాన్ని మార్చేసిన రోజు ఇదే! నువ్వు నా జీవితంలో ప్రసాదించిన సంతోషాన్ని మాటల్లో చెప్పలేను. పుట్టినందుకు థాంక్స్ సుకుమార్ అంటూ రెండు ఫోటోలు షేర్ చేశాడు. ఈ పోస్ట్ కింద అభిమానులు 'పుష్ప 3' కోసం వెయిటింగ్ అని కామెంట్లు చేస్తున్నారు.

# దానివల్లే నా పెళ్లి క్యాన్సిల్ అయ్యింది..




చైల్డ్ ఆర్టిస్ గా పలు సినిమాల్లో నటించి ఆతర్వాత హీరోయిన్ గా మారింది అందాల భామ తేజస్వి మదివాడ. ఈ చిన్నదాని గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. మహేష్ బాబు, వెంకటేష్ కలిసి నటించిన సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, నితిన్ హీరోగా నటించిన హార్ట్ ఎటాక్, రామ్ పోతినేని నటించిన పండగ చేస్కో లాంటి సినిమాల్లో నటించింది. ఆతర్వాత హీరోయిన్ గా మారి కేరింత సినిమా, ఐస్ క్రీమ్ లాంటి సినిమాలు చేసింది. రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన ఐస్ క్రీమ్ సినిమాలో బోల్డ్ పాత్రలో నటించి షాక్ ఇచ్చింది. ఆతర్వాత కొన్ని సినిమాలు, వెబ్ సిరీస్ ల్లో నటించిన తేజస్వి ఈమధ్య పెద్దగా కనిపించడం లేదు.. సినిమాలు సిరీస్ లే కాదు టాక్ షోలకు హోస్ట్ గాను చేసింది తేజస్వి. కాగా గతంలో తేజస్వి మదివాడ ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్, వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. 33 ఏళ్ల వయసులో తన బడీ ఫిట్‌గా, మరింత అందంగా మారడానికి జిమ్‌లో కష్టపడ్డానని ఆమె తెలిపారు. మాల్దీవులు, థాయ్‌లాండ్‌లలో బికినీలు ధరించానని, ఇది నటిగా సీన్స్ అవసరాల మేరకు మాత్రమేనని స్పష్టం చేసింది తేజస్వి. కిస్సింగ్ సన్నివేశాలు, రామ్ గోపాల్ వర్మ సినిమాలలో నటించానని గుర్తు చేసుకున్నారు. తాను ఇన్నోసెంట్‌ను కాదని తన బాయ్ ఫ్రెండ్ కు ముందే చెప్పానని, తన జీవితం, ప్రపంచం గురించి తనకు తెలుసని తేజస్వి చెప్పుకొచ్చింది. బిగ్ బాస్ షో తన కెరీర్‌కు అంతగా ప్లస్ అవ్వలేదని తేజస్వి తెలిపింది. 2017లో బిగ్ బాస్ లోకి వెళ్లడం పెద్ద తప్పు అని ఆమె అన్నారు. ఆ షో నుంచి వచ్చిన మానసిక ఒత్తిడి కారణంగా రెండు సంవత్సరాలు సినిమా ఆఫర్‌లు తీసుకోలేదని, తన మెంటల్ స్టేట్ ఎవరికీ అర్థం కాలేదని తెలిపింది. ఈ కారణంగా తన వివాహం కూడా రద్దైందని, తీవ్రమైన మానసిక వేదనకు గురై ఇండియా వదిలి వెళ్లిపోవాలని కూడా భావించినట్లు తెలిపింది. తెలుగు సినీ పరిశ్రమలో కమిట్‌మెంట్స్ అనే అంశంపై మాట్లాడుతూ, తనను ఎవరూ నేరుగా కమిట్‌మెంట్స్ అడగలేదని తెలిపారు. అయితే, కెరీర్ ప్రారంభంలో రాత్రి డిన్నర్‌కు పిలవడం వంటి కొన్ని షేడీ వైబ్స్‌ను తాను ఎదుర్కొన్నా అని తెలిపింది. అయితే, తన వ్యక్తిత్వం, నిర్మొహమాటంగా మాట్లాడే స్వభావమే తనను కమిట్‌మెంట్స్ నుండి కాపాడిందని తేజస్వి అభిప్రాయపడ్డారు. కమిట్‌మెంట్స్ అనేది తెలుగు చిత్ర పరిశ్రమకే పరిమితం కాదని, ప్రపంచంలో ఏ పరిశ్రమలోనైనా, ఏ రంగంలోనైనా ఇలాంటివి ఉంటాయని, తనను తాను కాపాడుకోవడం తన బాధ్యత తెలిపింది.


# ఇది ప్రభాస్ గిఫ్ట్

**బలమైన క్రమశిక్షణతో పెరిగిన మనసు, కళను ప్రేమించే హృదయం ఈ రెండింటి మధ్య సమతుల్యతే ఆమె వ్యక్తిత్వం. భాషలు మారినా, పాత్రలు మారినా తన అసలైన స్వరాన్ని మాత్రం కోల్పోని నటి రిద్ధి కుమార్. ఆ విషయాలన్నీ ఆమె మాటల్లోనే..**

ఆర్మీ బ్యాక్‌గ్రౌండ్‌లో పెరగడం వల్ల చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, ఫోకస్, దేనికైనా ఈజీగా అడాప్ట్ అవడం అన్నీ సహజంగానే అలవాటయ్యాయి. భాషలు నేర్చుకోవడం నాకు చాలా ఇష్టం. ఇంగ్లిష్, హిందీ, తెలుగు, తమిళం, ఫ్రెంచ్ సహా ఏడు భాషలు మాట్లాడగలను. కొత్త భాష అంటే నాకు కొత్త ప్రపంచం. మిస్ యూనివర్స్ ఇండియా వైల్డ్‌కార్డ్‌గా తిరిగి రావడం నాకే ఒక సర్‌ప్రైజ్. నటనతో పాటు నేనెవరో మళ్లీ గుర్తు చేసిన అనుభవం అది. అదే నన్ను సినిమాల్లోకి కూడా తీసుకొచ్చింది. తొలిసారి 'లవర్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యాను. తర్వాత 'అనగనగా ఓ అతిథి', 'రాధే శ్యామ్' చేశాను. ఇలా ప్రతి సినిమా నాకు ఒక పాఠమే. కెమెరా ముందు నటించడమే కాదు, కెమెరా వెనుక ప్రపంచాన్ని చూడడం కూడా నాకు చాలా ఇష్టం. ఫొటోగ్రఫీ చేస్తూ 'ఈ క్షణం మళ్లీ రాదు' అని అనిపిస్తుంది. ట్రావెల్ అంటే టూరిస్టు స్పాట్స్ కంటే 'హిడెన్ జెమ్స్' నాకు ఎక్కువ ఇష్టం. ఇటీవల అహ్మదాబాద్ ఓల్డ్ సిటీ వైబ్స్ నన్ను చాలా ఆకట్టుకున్నాయి. పుస్తకాలు నా బలహీనత. చదివే సమయం లేకపోయినా, కొనకుండా ఉండలేను. ఫిలాసఫీ అంటే నాకు చాలా ఆసక్తి. ఎంత బిజీగా ఉన్నా చదువు మాత్రం వదల్లేదు. 2025లో కూడా మాస్టర్స్ ఇన్ ఫిలాసఫీ చేస్తున్నాను.

స్కిన్ కేర్ విషయంలో కొన్ని తప్పులు చేశాను. మేకప్‌తోనే నిద్రపోవడం, వేడి నీళ్లతో ముఖం కడగడం ఇవన్నీ ఇప్పుడిప్పుడే మానేసి కాస్త జాగ్రత్తలు తీసుకుంటున్నాను. ఫ్యాషన్ విషయంలో నా స్టయిల్ మారుతూనే ఉంటుంది. ప్రస్తుతం దేసీ స్టయిల్ ఇష్టం. ముఖ్యంగా చీరలో ఉన్న అందం వేరే లెవల్. ఇప్పుడు నేను కట్టుకున్న చీర ప్రభాస్ గిఫ్ట్‌గా ఇచ్చిందే. ఇది వేసుకున్నప్పుడు ఇంకా ప్రత్యేకంగా అనిపిస్తుంది. నేనొక పెద్ద ఫూడీ. పుణేలోని ఒక టిబెటన్ స్ట్రీట్ ఫుడ్ స్పాట్ నాకు చాలా ఇష్టం. మోమోస్, థుక్‌పా అంటే ప్రాణం. అలాగే నెయ్యి దోశ, నెయ్యి కారంపొడి ఇడ్లీ, ఫిల్టర్ కాఫీ ఉంటే చాలు. ప్రతి ఒక్కరికీ కొన్ని ఆధ్యాత్మిక ట్రిప్స్ చాలా అవసరం. అలా శంకరాచార్య ఆలయంతో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. 2025 నాకు చాలా స్పెషల్. 'ది రాజా సాబ్' సినిమాలో ప్రభాస్‌తో కలిసి నటించడం నా కెరీర్‌లో పెద్ద అడుగు. అలాగే ఈ న్యూ ఇయర్‌కు మరాఠీ సినిమాతో కొత్త ఇండస్ట్రీలోకి కూడా అడుగు పెట్టబోతున్నాను.





# డేటింగ్ రూమర్స్..

## పిచ్చ లైట్ అంటున్న హీరోయిన్

సినీ తారలు అన్నాక.. రకరకాల రూమర్స్ వస్తుంటాయి. సోషల్ మీడియాలో ఏవోవో రాస్తుంటారు. ప్రేమలో పడకపోయినా..త్వరలోనే పెళ్లి అంటూ పోస్టులు పెడుతుంటారు. ఇక డేటింగ్ రూమర్స్ గురించి చెప్పనక్కర్లేదు. అయితే ఇలాంటి పుకార్లను కొంతమంది నటీనటులు పర్సనల్‌గా తీసుకుంటారు. బాధ పడతారు. భయపడతారు.. ఖండిస్తారు. మరికొంతమంది అయితే.. ఎన్ని పుకార్లు వచ్చిన పట్టించుకోరు. దానిపై ఒక్క మాట కూడా మాట్లాడకుండా..తమ పని తాము చేసుకొని వెళ్తారు. తాను కూడా ఆ బాపతే అంటోంది అందాల తార మీనాక్షి చౌదరి. ట్రోలింగ్, రూమర్స్ అనేవి పిచ్చ లైట్‌గా తీసుకుంటానని చెబుతోంది. ఇటీవల మీనాక్షి ప్రేమ, పెళ్లిపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. టాలీవుడ్ యంగ్ హీరో సుశాంత్‌తో ప్రేమలో ఉందని.. త్వరలోనే పెళ్లి కూడా చేసుకోబోతున్నారని వార్తలు వినిపించాయి. అయితే మీనాక్షి మాత్రం ఈ రూమర్స్‌ని ఖండించింది. సుశాంత్ తనకు మంచి స్నేహితుడు మాత్రమే అని..అంతకు మించి తమ మధ్య ఎలాంటి బంధం లేదని స్పష్టం చేసింది. అయినా కూడా రూమర్స్ ఆగడం లేదు. అయితే ఇలాంటి పుకార్లను చూసి నవ్వుకుంటానే తప్ప అస్సలు హార్ట్‌కు తీసుకోనని మీనాక్షి చెప్పింది. ఆమె నటించిన తాజా చిత్రం 'అనగనగ ఒకరాజు' జనవరి 14న విడుదల కాబోతుంది. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా 'సోసల్ మీడియాలో వచ్చే రూమర్స్‌ని ఎలా తీసుకుంటారు?' అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు పై విధంగా సమాధానంగా చెప్పింది. సెలెబ్రెటీల పెళ్లిపై పుకార్లు రావడం కామన్.. ఇప్పటికే నాకు సోషల్ మీడియాలో చాలా సార్లు పెళ్లి చేశారంటూ మీనాక్షి నవ్వేసింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com